


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 125 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 17 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 125 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 17 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు...?

### కేంద్ర ఎన్నికల సంఘంపై మమత ఆగ్రహం

- బెంగాల్‌లో కీలక అధికారులను బదిలీ చేసిన ఈసీ
- ఈసీ నిర్ణయంపై సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం
- బీజేపీకి అనుకూలంగా ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపణ
- ఎన్ని మార్పులు చేసినా బెంగాల్‌లో ప్రభుత్వం మారదని స్పష్టం
- తన ఇంటిపై కూడా దాడి జరిగే అవకాశం ఉందని మమత వ్యాఖ్య

- మిగతా2లో

## సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి క్లాస్

- అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచన
- అసెంబ్లీకి అన్ని విధాలుగా సిద్ధమై రావాలన్న సీఎం
- ఎమ్మెల్యేలకు సమయం ఇవ్వాలని మంత్రులకు సూచన



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశం లో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకు న్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు.

- మిగతా2లో

## బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీయే

- బీహార్‌లోని ఐదు రాజ్యసభ స్థానాలను గెలుచుకున్న ఎన్డీయే
- సీఎం నితీశ్ కుమార్ సహా ఐదుగురు అధికార కూటమి అభ్యర్థులు విజయం
- ఓటింగ్‌కు దూరంగా ఉన్న నలుగురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు
- తమ ఎమ్మెల్యేలను బీజేపీ గృహనిర్బంధం చేసిందని కాంగ్రెస్ ఆరోపణ
- ఎన్డీయే విజయానికి దోహదపడిన అసెంబ్లీలో సంఖ్యాబలం



పెన్ పవర్ డెస్క్:బీహార్‌లో జరిగిన ఐదు రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఐదు స్థానాల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకుని ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'కు గట్టి షాక్ ఇచ్చింది. ఈ విజయంతో ఎన్డీయే కూటమి తమ సంఖ్యాబ లాన్ని మరోసారి నిరూపించుకుంది. ఎన్డీయే తరపున ముఖ్యమంత్రి, జేడీయూ జాతీయ అధ్యక్షుడు నితీశ్ కుమార్, బీజేపీ నేత నితిన్ నబిన్, కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, రాష్ట్రీయ లోక్ మోర్చా

- మిగతా2లో



## ఈనెల 30 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు
- ఈ నెల 19న ఉగాది సందర్భంగా సభకు సెలవు
- మార్చి 20న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేడు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ రేపటికి వాయిదా పడింది. అనంతరం జరిగిన బీఏసీ సమావేశంలో బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, చర్చ ఉంటుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా సభకు సెలవు ఉంటుంది. మార్చి 20న డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ సమావేశాలు కేవలం బడ్జెట్‌కే పరిమితం కాకుండా, రాజకీయంగా కూడా వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు, రైతు భరోసా, మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది.



# గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

- రాష్ట్రానికి రూ.5.72 లక్షల కోట్ల పెట్టుబడులు
- హిమాయత్ సాగర్ నుంచి మూసీ పునరుజ్జీవం స్టార్ట్
- ఫ్యూచర్ సిటీ నుంచి బందరు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే
- మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా
- ఎస్హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలిచ్చే చర్యలు
- రికార్డు స్థాయిలో 67,763 ఉద్యోగాలు భర్తీ
- అసెంబ్లీలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన గవర్నర్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణను గ్లోబల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఇవాళ ఆయన అసెంబ్లీలో ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. తెలుగులో ప్రసం గాన్ని ప్రారంభించిన గవర్నర్ రాష్ట్రం చేపడుతున్న పథకాలను, లక్ష్యాలను వివరించారు. ప్రజా ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 5.72 లక్షల కోట్ల పెట్టుబడులువచ్చాయని వివరించారు. తెలంగాణ ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా

- మిగతా2లో



## హోర్ముజ్‌ను రక్షించడానికి వస్తాం కానీ..

### డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షరతు

- హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు కలిసి రావాలన్న ట్రంప్
- పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని చైనా షరతు
- ఉద్రిక్తతలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని అమెరికాకు సూచన

పెన్ పవర్ డెస్క్:హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు ప్రపంచ దేశాలు కలిసి రావాలని అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ ప్రభావంతో ఇబ్బందిపడుతున్న చైనా సహా వివిధ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ట్రంప్ విజ్ఞప్తిపై స్పందించిన

- మిగతా2లో

## సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...



### తెలంగాణ కవి సిధారెడ్డికి జాతీయ పురస్కారం

### 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి దక్కిన గౌరవం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. నందిని సిధారెడ్డిని కేంద్ర సాహిత్య అకాడమీ

- మిగతా2లో



## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

- ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ సహా పలు ప్రాంతాల్లో వర్షం
- నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్

- మిగతా2లో

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం

- తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు షురూ
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలన్న కేటీఆర్
- వాటికి చట్టబద్ధత కల్పించి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్
- కాంగ్రెస్ సర్కారు రైతులను, ప్రజలను మోసం చేసిందని విమర్శలు
- "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో పోరాడతామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో

- మిగతా2లో

## ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిన ఇరాన్... అధ్యక్షుడు వాడే విమానం పేల్చివేత

- ఇరాన్ అగ్రనేతలు వాడే విమానాన్ని ధ్వంసం చేశామన్న ఇజ్రాయెల్
- టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ దాడి జరిగినట్లు ప్రకటన
- ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందన్న ఐడీఎఫ్
- టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ నగరాల్లోనూ దాడులు జరిపినట్లు వెల్లడి
- హోర్ముజ్ జలసంధి విషయంలో సాయం చేయాలని నాటోపై ట్రంప్ ఒత్తిడి



పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుప డింది. టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్ర యంలో ఇరాన్ అగ్ర నాయకత్వం ఉపయోగించే ఒక కీలక విమానాన్ని ధ్వంసం, పలు సైనిక స్థావరాలను చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిపినట్లు తెలిపింది.

- మిగతా2లో

# గ్లోబల్ హబ్ గా తెలంగాణ

- మొదటి పేజి తరువాయి

మారిందని అన్నారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఈ రంగం 9.39లక్షల ఉద్యోగాలు కల్పిస్తోం దని చెప్పారు. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని చెప్పారు. జీసీసీలలో 20 శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్ మారిందని అన్నారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 55 కి.మీ. మేర మూసీ పునరుజ్జీవం చేస్తామన్నారు. మూసీలోకి మురుగు నీరు చేరకుండా 39 ఎస్టీపీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించబోతున్నామ ని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించామని వివరించారు. ఇందులో భాగంగానే... మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని అన్నారు. 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన వివరించారు.

**మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా**

గతేడాది వానాకాలంలో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లు ఇచ్చామని సీఎం వివరిం చారు. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, 3.38 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయి. ఎస్హెచ్‌ఎల కు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈగల్ ప్రత్యేక బృందం ద్వారా డ్రగ్స్సమస్యను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. టీజీపీఎ స్సీ, ఇతర నియామక బోర్డులను సంస్కరించామని అన్నారు. రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు.

## ఎడిటర్ వ్యూ

### కాంగ్రెస్ లో అసంతృప్తి బయటపడే అవకాశాలు ఎంత?

తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృప్తి అనేది బయటపడకుండా ఉంది. అయితే ఎన్నికలు దగ్గర పడే సమయంలో అది మరింత బయటపడే అవకాశముందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అప్పర్ హ్యాండ్ గానే ఉంది. ఢిల్లీ హైకమాండ్ వద్ద కూడా ఆయనకు తిరుగులేదు. ఎన్ని ప్రచారాలు జరిగినప్పటికీ రేవంత్ రెడ్డి విషయంలో ఢిల్లీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కూడా సీనియర్ నేతల్లో అసంతృప్తి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది.

**ఎదిరించి ఏమీ చేయలేమని...**

కానీ అది బయట పడేంత మాత్రం లేవన్నది వాస్తవం. ఎందుకంటే రేవంత్ రెడ్డిని ఎదిరించి ఇప్పుడు సాధించేదేమీ ఉండదని అందరికీ తెలుసు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు ఇక పార్టీ నుంచి సర్దేసుకుంటున్నప్పటికీ, చాలా మంది అసంతృప్తి నేతలు తమకు భవిష్యత్ లోనూ పదవులు రావన్న ఆందోళనలో ఉన్నారు. రేవంత్ రెడ్డి ఒంటిచేత్తో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారు. అందులో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ను పదేళ్ల పాటు ప్రజలు కాదన్నప్పటికీ రేవంత్ రెడ్డి వ్యూహాలు, అనుసరించిన విధానాలతోనే పార్టీ అధికారంలోకి వచ్చింది. అయినా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నేతగా చూసేందుకు కొందరు ఇష్టపడకపోవడంతోనే ఈ సమస్య ఉందని చెబుతున్నారు.

**సీనియర్ నేతలను కలుపుకుంటూనే...**

అయితే అది కాంగ్రెస్ పార్టీ. ప్రజాస్వామ్యం పాళ్లు చాలా ఎక్కువ. ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీ అయిన బీజేపీ తరహా లాంటిది కాదు. ఎవరి లాబీయింగ్ వారికి ఉంటుంది. ఢిల్లీ స్థాయిలో అందరికీ సంబంధాలున్నాయి. అయితే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్లు కూడా సమయం కోసం వేచి చూస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అయితే సీనియర్ నేతలను కలుపుకుని వెళుతూనే తాను అనుకున్నది చేసుకుంటూ వెళుతుండటంతో ఇప్పటి వరకూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నేతలు ఇక ఊరికే ఉండరని, చికాకు తెప్పించడం ఖాయమన్న కామెంట్స్ సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. మరి పదేళ్ల పాటు అధికారం తమదేనంటున్న రేవంత్ రెడ్డి నేతలను ఎలా కంట్రోల్ లో పెడతారో చూడాలి.

## సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి క్లాస్

- మొదటి పేజి తరువాయి

బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు.ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు.

ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.

సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు.రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.

## సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...

- మొదటి పేజి తరువాయి

అవార్డ్ వరించింది. వచన కవిత్వం విభాగంలో ఆయన రచించిన అనిమేష కవితా సంపుటికి గాను కేంద్రం ఈ అవార్డు ప్రకటించింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ రావడం పట్ల సిధారెడ్డికి పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

తెలంగాణ మట్టి సువాసనను, ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో విశ్వవ్యాప్తం చేసిన ప్రముఖ కవి, సాహితీవేత్త నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం అత్యంత సంతోషదాయకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ఇది తెలంగాణ సాహిత్యానికి దక్కిన గొప్ప గౌరవమని ప్రశంసించారు.

**నందిని సిధారెడ్డి బ్యాగ్రౌండ్:**

తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని తన కలం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డి 1955, జూన్ 12న మెదక్ జిల్లాలోని బందారం గ్రామంలో జన్మించారు. తెలంగాణ ఉద్యమంలో అక్షర యోధుడిగా క్రియాశీల పాత్ర పోషించిన ఆయన హైదరాబాద్?లోని చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. ఆధునిక తెలుగుకవిత్వంలో సూర్యుడు అనే టాపిక్?పై ఎం.ఫిల్ పట్టా పొందారు. అనంతరం ఆధునిక కవిత్వం, వాస్తవికత -- అధివాస్తవికతపై

పరిశోధన చేసి 1986లో పీహెచ్?డీ పట్టా అందుకున్నారు. ఆయన రాసిన నాగేటి చాల్లల్ల నా తెలంగాణ కవిత అత్యంత ప్రజాదరణ పొందింది. నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా పనిచేశారు.

**పాటల రచయితగా నందిని సిధారెడ్డి**

నాగేటి సాల్లల్ల నా తెలంగాణ (పోరు తెలంగాణ–2011)

ఒక పువ్వు ఒక నవ్వు ఉయ్యాలలూగేనా.. (జై బోలో తెలంగాణ–2011)

పుడమి పండుగ పువ్వుల జాతర (కొలిమి)

ఇది చరిత్ర ఇది పవిత్ర జనవిముక్తి సమరం.. (బందూక్–2015)

చెలియా చెలియా విడిపోకే కలలా (2 కంట్రీస్–2017)

## ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం

- మొదటి పేజి తరువాయి

కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళు లర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ.1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు.

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## ఏమిటీ అర్ధరాత్రి బదిలీలు...?

పశ్చిమ బెంగాల్‌లో కీలక ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేయడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి వేళ ఈ బదిలీలు చేపట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కనుసన్నల్లోనే ఈసీ పనిచేస్తోందని, ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని ఆరోపించారు.సోమవారం అర్ధరాత్రి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, హోం సెక్రటరీ జేపీ మీనాలతో పాటు డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ఈసీ బదిలీ చేసింది. దీనిపై మమత ఘాటుగా స్పందించారు. "అర్ధరాత్రి ఒంటి గంటకు నాకు మెసేజ్ వచ్చింది. ఇలాంటి చర్యలు ఎప్పుడైనా చూశారా? చీఫ్ సెక్రటరీ ఒక బెంగాలీ మహిళ. ఆమెను తొలగించారు. వీళ్లు బెంగాలీలకు, మహిళలకు వ్యతిరేకులు" అంటూ కేంద్రంపై మండిపడ్డారు.గతంలో అధికారుల బదిలీకి ముందు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను ఈసీ కోరేదని, కానీ ఈసారి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని మమత ఆరోపించారు. "ఇదేమైనా ఢిల్లీ లడ్డూ అనుకుంటున్నారా? ఇది వాళ్ల జాగీరా?" అని ప్రశ్నించారు. డీజీపీగా ఉన్న పీయూష్ పాండే బెంగాలీ కాదని, ఆయనను కూడా తొలగించారని గుర్తు చేశారు. బీజేపీకి

అనుకూలంగా పనిచేసే వారిని మాత్రమే ఎంపిక చేసుకుంటున్నారని విమర్శించారు.వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కోల్‌కతాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు అన్నీ మార్చండి.. అయినా సరే బెంగాల్‌లో ప్రభుత్వం మారదు. ఇది నా మాట" అని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి శశి పంజా ఇంటిపై దాడి జరిగినట్లే, తన నివాసంపై కూడా దాడి చేసే అవకాశం ఉందని మమత ఆందోళన వ్యక్తం చేశారు. "ధైర్యం ఉంటే వచ్చి దాడి చేయండి. మేం ఎదుర్కొంటాం" అని సవాల్ విసిరారు. అదే సమయంలో, ప్రజలు సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే చర్యలకు లొంగవద్దని సూచించారు.

## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావ రణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమ య్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిప ‌డ్డారు.మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీటిని తొలగించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి.

## హార్ముజ్‌ను రక్షించడానికి వస్తాం కానీ.. డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షరతు

- మొదటి పేజి తరువాయి

చైనా ఒక షరతు విధించింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హార్ముజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు తాము ముందుకు వస్తామని, కానీ అంతకంటే ముందు పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని అమెరికాకు చైనా షరతు విధించింది. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలని అమెరికాకు సూచించారు. ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల చివరలో ట్రంప్ బీజింగ్ పర్యటనపై అమెరికాతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హార్ముజ్ ప్రాంతం మీదుగా అధిక ప్రయోజనాలు పొందుతున్న దేశం చైనాయేనని ట్రంప్ నిన్న వ్యాఖ్యానించారు. ఆ జలసంధిని రక్షించడానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. చైనా నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి తన బీజింగ్ పర్యటనపై నిర్ణయం ఉంటుందని అన్నారు. కాగా, ట్రంప్ పిలుపును జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు పట్టించుకోలేదు.

## బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీయే

- మొదటి పేజి తరువాయి

చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, బీజేపీ అభ్యర్థి శివేష్ రామ్ బరిలో నిలిచి విజయం సాధించారు. సోమవారం బిహార్ శాసనసభలో జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే పక్షాన 202 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, మహాగఠ్‌బంధన్ నుంచి కేవలం 37 మంది ఎమ్మెల్యేలు మాత్రమే పాల్గొన్నారు.మరోవైపు, ప్రతిపక్షాలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌కు చెందిన మనోజ్ బిస్వాస్, సురేంద్ర కుష్వాహా, మనోహర్ ప్రసాద్ సింగ్, ఆర్జేడీ ఎమ్మెల్యే ఫైసల్ రెహ్మాన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. తమ ముగ్గురు ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించి గృహ నిర్బంధంలో పెట్టిందని బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ తీవ్ర ఆరోపణలు చేశారు.సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా, మొదటి ప్రాధాన్యత ఓట్లతో నితీశ్ కుమార్, నితిన్ నబిన్, రామ్‌నాథ్ ఠాకూర్, ఉపేంద్ర కుష్వాహా గెలిచారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో శివేష్ రామ్ విజయం సాధించారు. మహాగఠ్‌బంధన్ అభ్యర్థి ఏ.డి. సింగ్‌కు 38 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ విజయంపై ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ.. సొంత ఎమ్మెల్యేలే ఓటు వేయని దుస్థితిలో ఆర్జేడీ, కాంగ్రెస్ ఉన్నాయని విమర్శించారు. ం

## ఇజ్రాయెల్ దాడులతో దద్దరిల్లిన ఇరాన్... అధ్యక్షుడు వాడే విమానం పేల్చివేత

- మొదటి పేజి తరువాయి

ఐడీఎఫ్ ప్రకటన ప్రకారం, ధ్వంసమైన విమానం ఎయిర్‌బస్ ఏ340. దీనిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, గతంలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ వంటి అగ్ర నాయకులు దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉపయోగించేవారు. టెహ్రాన్‌లోని ఈ విమానాశ్రయంలో దేశీయ విమానాలతో పాటు ఇరాన్ వైమానిక దళానికి చెందిన సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి. ఇదే సమయంలో టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ వంటి ఇతర నగరాల్లోని మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు, హార్ముజ్ జలసంధిని తెరిచి ఉంచే విషయంలో అమెరికాకు మిత్రదేశాలు సాయం చేయకపోతే నాటో భవిష్యత్తు 'చాలా దారుణంగా' ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, ఆదివారం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ జలసంధి ద్వారా యూరప్ దేశాలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయని, కాబట్టి అక్కడి భద్రతకు వాళ్లు కూడా బాధ్యత వహించాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విషయంలో అమెరికా గతంలో యూరప్‌కు సాయం చేసిందని, ఇప్పుడు వారు తమకు సాయం చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వాదించారు.

బౌరంపేట్‌లో పాత పాట్టాలతో ఈ దశలో అక్రమ నిర్మాణ పనులు నిలిపివేత..ఫైల్‌ఫోటో..






బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో.. పనులు నిలిపివేసిన తరువాత రెండు స్లాబ్‌లు..


- సీసీకెమెరాల నిఘాలో అక్రమ కట్టడాల పర్వం..
- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో "కాలం చెల్లిన" పాత పట్టాల పేరిట దందా..?
- దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120లో '58-59' మాటున అక్రమ నిర్మాణాల పర్వం..
- అధికారుల అండతో..? పనికిమాలిన సిఫార్సుల మాటున కబ్జాల పర్వం..!

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

# ప్రభుత్వ భూముల్లో..! కబ్జాల రాజ్యం..!

## పాత పట్టాలు-కొత్త కట్టడాలు..! "భూదాన్ భూముల్లో అక్రమ షెడ్లు..!

- కలెక్టర్ ఆదేశాలు పక్కనపెట్టారు..! కబ్జాదారులకు అండగా నిలిచారు..!
- దుండిగల్‌లో రెవెన్యూ ఇష్టారాజ్యం..! కబ్జాదారుల సంబరాలు..!
- చర్యలు శూన్యం- కబ్జాలు పుష్కలం..! రెవెన్యూ వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు..?



ఇలా ఒక పిల్లర్ ఉన్నప్పుడు పనులు నిలిపివేత..




బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పనులు నిలిపివేసిన తరువాత ఇలా స్లాబ్..

మధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్' మార్చి 16:**

ఆ రెవెన్యూ అధికారులు ఏం చెబితే అదే ఫైనల్..! వాళ్ళు చెప్పిందే వేదం..! తప్పంటే తప్పు..! ఒప్పంటే ఒప్పు..! కబ్జాదారులను తమ గుప్పిట్లో పెట్టుకునే ఉద్దేశమో..? లేక తమ ఉనికిని చాటుకునేందుకో ఏమో తెలియదు కానీ..! కొన్ని కబ్జాలపై చర్యలు తీసుకోక పోవడంపై..! రెవెన్యూ అధికారుల వ్యవహార శైలి పలు అనుమానాలను రేకెత్తిస్తుంది.. ముఖ్యంగా "గాగిల్లాపూర్- దొమ్మర పోచంపల్లి- బౌరంపేట్" ఈ మూడు గ్రామాల ప్రభుత్వ భూముల కబ్జాలపై సానుభూతి చూపడం వెనుక ఆంతర్యం ఏమిటో..? తెలియదు కానీ తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. ఈ వ్యవహారంలో "జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు" కూడా దుండిగల్ గండిమైసమ్మ రెవెన్యూ అధికారులకి ఎదురు చెప్పలేక పోతున్నట్టు స్పష్టమవుతుంది..! కబ్జాలపై చర్యలు లేకపోవడం కూడా ఒక కారణమని వినికిడి.. ఆ రెవెన్యూ అధికారి బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే పదేళ్ళ క్రితమే నిర్మించిన "28 పాత గదులను" అక్రమ కట్టడాలుగా పేర్కొంటూ..! నేలమట్టం చేసిన బాధ్యత గల అధికారి.. అక్రమ నిర్మాణాల ప్రోత్సాహంలో "తగ్గేదే-లే" అన్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.. మరోవైపు కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక రూ. లక్షలు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి..

- దుండిగల్ మండలంలో అధికారమే అండగా ప్రభుత్వ భూముల కబ్జాలు..?
- కలెక్టర్-అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..
- మల్కాజిగిరి ఆర్డీవో ఉన్నప్పటికీ..! నిమిత్త మాత్రులేనని తేటతెల్లం..
- ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తున్న రెవెన్యూ అధికారులపై సర్వత్రా ఆరోపణలు వ్యక్తం..!
- గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్ల వ్యవహారం లోనూ ఇదే తరహా..
- అదనపు కలెక్టర్ ఆదేశాలు కూడా బేఖాతర్.. ప్రజాప్రతినిధి సిఫార్సులకే ప్రాధాన్యత..
- భూదాన్ భూమిలో ప్రజాప్రతినిధి బంధువు షెడ్డుపై చర్యలు ఉండవట..?
- ప్రభుత్వ భూముల్లో తాజా అక్రమ కట్టడాల పట్ల అధికారుల సానుభూతి..?
- దుండిగల్ రెవెన్యూ అధికారుల తిరుగులేని విధులపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం..

-4లో




# తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కాలరాస్తుంది



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ నీటి హక్కులను ఏపీ కాలరాస్తోందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. 775 టీఎంసీల నీళ్లు గోదావరిలో తీసుకోవాలని ఏపీ కుట్రపన్నుతోందని విమర్శించారు. తెలంగాణ నీళ్లను ఏపీ దోచుకుపోతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అండ చూసుకుని ఏపీ ప్రభుత్వం రెచ్చిపోతుందన్నారు. రేవంత్ రెడ్డిని ఏపీ ప్రభుత్వం తమ ఏజెంట్ గా భావిస్తోందని.. రేవంత్ రెడ్డి చర్యలతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు హరీశ్ రావు. గోదావరి నల్లమల సాగర్ పై వ్యతిరేకంగా గవర్నర్ ప్రసంగంలో ఎందుకు ప్రభుత్వం చెప్పలేదని ప్రశ్నించారు హరీశ్. ఏపీ గవర్నర్ ప్రసంగంలో

-6 లో

# ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి

- తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో డ్రగ్స్ కలకలం
- డ్రగ్స్ మూలాలు సినీ పరిశ్రమలో ఎక్కువగా కనిపిస్తున్నాయన్న అనిరుధ్ రెడ్డి
- సినిమా విడుదలకు ముందు నటీనటులందరికీ డ్రగ్స్ టెస్టులు నిర్వహించాలని సూచన


-6 లో



# ప్రభుత్వ భూముల్లో..! కబ్జాల రాజ్యం..!

బేస్మంట్ దశలోనే 2025 అక్టోబర్ 11న రెవెన్యూ కూల్చివేత..ఫైల్‌ఫొటో..




అప్పుడు రెవెన్యూ కూల్చిన ఈ నిర్మాణం ఇలా ఎలా..?

## బౌరంపేట్‌లో సిఫార్సుల పేరిట.. అక్రమ నిర్మాణాల దందా..!

గండిమైసమ్మ దుండిగల్ మండలంలో, ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం.. అక్రమార్కులకు కట్టబెట్టేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. బౌరంపేట్ సర్వే నెంబర్ 576 ప్రభుత్వ భూమిలో 2007లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 561 ప్లాట్లతో లేఅవుట్ వేశారు.. కొన్ని పార్కులను కూడా లేఅవుట్‌లో చూపుతూ పేదలకు పట్టాలు జారీచేసింది.. ఓ పార్కుస్థలంలో కూడస అదనంగా 22 పట్టాలు మంజూరు చేసి, మొత్తం 583 ప్లాట్‌లు లబ్దిదారులకు జారీచేశారు.. లేఅవుట్ నిర్మాణం లో కొన్ని పట్టాలు కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లోనూ ఉన్నట్లు సమాచారం.. అప్పట్లో భూములకు ధరలు కూడా లేకపోవడం, లబ్దిదారులు పట్టించుకోలేదు.. కొందరు ఎక్కడో ఉన్నరు.. మరికొందరు అసలు లేరనే స్థానికుల వాదన.. అయినప్పటికీ ఖాళీ ఫ్లాట్ స్థలాలు గుర్తించి కొందరు దళారులు, కొనుగోలు చేసినట్లు పాత పట్టాలు చూపిస్తూ 20 ఏళ్ళ తరువాత ఇప్పుడు అటు మున్సిపల్ పర్మిషన్ లేకుండానే.. రెవెన్యూ అధికారుల అనధికారిక అనుమతితో యధేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..

## అవగాహనలేని రెవెన్యూ.. నిబంధనలకు తిలోదకాలు..

ప్రభుత్వ పట్టాల జారీతో కొన్ని నిబంధనలు కూడా పొందుపరిచారు.. 6-12 నెలల లోపు నిర్మాణం చేపట్టక పోయినా..! సంబంధిత పట్టాలు లబ్దిదారులు విక్రయించినా..! ఇతరులు ఎవరైనా కొనుగోలు చేసినా సంబంధిత పట్టలాను రద్దుచేస్తూ, ప్లాట్‌లకు సంబంధించిన స్థలాలు ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలనే నిబంధనలు, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. కంచే చేను మేసిన చందంగా, ప్రభుత్వ నిబంధనలను రెవెన్యూ అధికరులే కాల రాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి..! కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాలతో నిర్మించే అక్రమ కట్టడాలను అడ్డుకుంటే తమపై కేసువేస్తారని ఒక అవగాహన లేని అధికారి సమాధానం లోనే స్పష్టత నిస్తుంది.. 60 గజాల అక్రమ నిర్మాణానికి రూ.లక్ష వరకు చెల్లించే విధంగా ధరను నిర్ణయించినట్లు వినికిడి.. అందుకే ఎలాంటి ఆటంకాలు లేకుండా యధేచ్ఛగా అక్రమ కట్టడాల పరంపర కొనసాగుతుందని విమర్శలు ఉన్నాయి.. బాధ్యత లేని అధికారుల విధుల్లో "చట్టాలు-నిబంధనలు" నిర్వీర్యం అవుతున్నాయి..!

## తప్పుడు "ఎన్‌వోసి"లు గుర్తించి కలెక్టర్ "డి-నోటిఫికేషన్"..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ-దుండిగల్ మండలం పరిధిలోని గాగిల్లాపూర్ భూదాన్ భూములుగా నమోదైన పలు సర్వే నెంబర్‌లపై, గతంలో రెవెన్యూ తప్పిదంతో జారీ చేసిన తప్పుడు "ఎన్‌వోసి"లను రద్దు చేసి,రిజిస్ట్రేషన్‌లు కూడా నిలిపి వేయాలంటూ, అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.. "కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంపుల శాఖకు" 28 జనవరి 2025 తేదీన నాటి కలెక్టర్ లేఖ రాశారు.. ఈ లేఖలో గాగిల్లాపూర్ గ్రామ పరిధిలోని భూదాన్ భూముల "డి-నోటిఫికేషన్" అంశాన్ని స్పష్టంగా వివరించారు.. గాగిల్లాపూర్ సర్వే నెంబర్‌లు 138, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148, 150, 151, 155, 161 మరియు 165 లలో మొత్తం 77-19 ఎకరాల భూదాన్ భూములు నమోదైన్నట్టు రెవెన్యూ పరిశీలన (ఆర్డీవో-తహశీల్దార్ విచారణ)లో తేలిందని కలెక్టర్ పేర్కొన్నారు..

భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు ఇలా నిర్మాణం పూర్తి..




గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు.. రెవెన్యూ అధికారుల దృష్టికి ఇలా..

## విచారణలో బయటపడిన.. సరిచేసిన కలెక్టర్..!

ఈ భూదాన్ భూముల్లో గతంలోనే (బహుశా బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో) కొన్ని సందర్భాల్లో "ఎన్‌వోసి"లు జారీచేసి, ఆ తర్వాత నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించబడినట్లు నాటి కలెక్టర్ గౌతమ్ పోట్రు పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌లోని "టిఎం-15" మాడ్యూల్ ద్వారా సర్వే నెంబర్ 150లో 01-05 ఎకరాలు, మరియు 151లో 01-07 ఎకరాలకు, సంబంధించిన భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు వచ్చిన దరఖాస్తులతో ఈ బండారం బయటపడింది.. ఆ దరఖాస్తులను కలెక్టర్ ఆదేశాలతో అప్పటి దుండిగల్ తహసీల్దార్, మల్కాజిగిరి ఆర్డీవోలు చేపట్టిన కూలంకష విచారణలో దిమ్మతిరిగే నిజాలు బట్టబయలు అయ్యాయి.. రెవెన్యూ రికార్డుల ప్రకారం, గాగిల్లాపూర్ సర్వే నెంబర్ :150 , 151 జి.ఓ.ఎం.ఎస్ నెం.286 (09-03-2005) ప్రకారం భూదాన్ భూములను 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్నట్లు విచారణలో తేలిందని కలెక్టర్ లేఖలో పేర్కొన్నారు..

## భూదాన్ భూమిలో అక్రమ షెడ్లకు ప్రజాప్రతినిధి సిఫార్సులట..?

గాగిల్లాపూర్ భూదాన్ భూములపై గతంలోనే రెవెన్యూ తప్పిదాలతో నెలకొన్న పొరపాట్లను గ్రహించి డి-నోటిఫికేషన్‌పై కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలతో నిషేధిత జాబితాలో పెట్టడానికి కృషి విషయం తెలిసిందే.. పెన్ పవర్ దినపత్రికలో పలుమార్లు వార్తా కథనాల్లో ప్రచురించడం కూడా జరిగింది.. గాగిల్లాపూర్ సర్వే నెం.145 లో ఓ అక్రమ షెడ్డు నిర్మాణంపై ప్రారంభ దశనుండే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా నేటికీ చర్యల్లేవు.. దుండిగల్ రెవెన్యూ అధికారులు కలెక్టర్ చేసిన "డి-నోటిఫికేషన్"ను ధిక్కరించి, అక్రమ షెడ్లను ప్రోత్సహిస్తున్నారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఈ అక్రమ షెడ్డు కంటే ముందే మరో షెడ్డు విషయంలో రెవెన్యూ అధికారుల మొక్కుబడి కూల్చివేతలు, హాస్యాస్పదంగా ఉన్నాయి.. రెవెన్యూ అధికారులకు తోడుగా తానా తందానా అంటూ, 5 శాతం రెవెన్యూ కూల్చిన షెడ్డుకు విద్యుత్ అధికారులు ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం కొసమెరుపు.

- 3 పేజి తరువాయి

స్వయంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ "డి-నోటిఫికేషన్" చేసిన భూదాన్ భూములు ఒకవైపు..! ప్రభుత్వం జారీచేసిన కాలంచెల్లిన ఇందిరమ్మ పట్టాలు మరోవైపు- అటు జోవో నెం.58-59 లపై..! కనీస అవగాహన లేని రెవెన్యూ అధికారులు దుండిగల్ గండిమైసమ్మ మండలంలో విధులు నిర్వర్తించడం మన దౌర్భాగ్యం అంటూ ప్రజలు మండి పడుతున్నారు.. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నా..!అధికారముందనే ధైర్యంతో నిమ్మకు నీరెత్తిన్నట్టు ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. "ముడుపులు ముట్టేవరకే తాత్కాలిక పనుల నిలిపివేత..?" ముడుపులు ముట్టాయా చర్యలు గోవిందా..? అన్నట్టు తయారైందన్న ఆరోపణలు లేకపోలేదు.. ప్రశ్నించేందుకు విలేఖరులు ఫోన్ చేస్తే ఎత్తరు..? మెస్సేజ్ పెడితే సమాధానం ఉండదు..! ఇక తహశీల్దార్‌కు సంబంధించిన అధికారిక ఫోన్ కూడా బ్లాక్ చేయడం.. ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.. అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే "వాళ్ళ సిఫార్సులు- వీళ్ళ సిఫార్సులు" ఉన్నాయంటూ నిబంధనలకు పాతరేసి చకచకా అక్రమ నిర్మాణాలు పూర్తి చేయడం సర్వసాధారణంగా మారింది.. సిఫార్సులకు- పాత పట్టాలతో ఇండ్లు నిర్మించుకోవడాన్ని చట్టబద్దం చేస్తే సరిపోతుంది కదా అన్న సూచనలు వస్తున్నాయి.. అధికారులు ఇంత బహిరంగంగా కబ్జాలకు సహకరించడం, ఇదంతా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా చోద్యం చూడటం గమనార్హం..


పెన్ పవర్ PEN POWER
పెన్ పవర్ తెలంగాణ
భూదాన్ భూముల్లో షెడ్లు..! కాలంచెల్లిన పట్టాలతో నిర్మాణాలు..!


పెన్ పవర్ PEN POWER
భూదాన్ భూముల్లో షెడ్లు..! కాలంచెల్లిన పట్టాలతో నిర్మాణాలు..!

గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో.. జులైలో ఇలా రెవెన్యూ పాక్షిక చర్యల ఘనకార్యం..






పాక్షిక చర్యల షెడ్డుకు విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..



2025 జూన్ 19న గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు ఇలా.. ఫైల్‌ఫొటో..

# రాహుల్ ను విమర్శిస్తే పెద్దోళ్లు అవ్వరు...

**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే ముందు మంత్రి సీతక్క బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని విమర్శిస్తేనే తాను పెద్ద నాయకుడిని అవుతానని కేటీఆర్ భ్రమపడుతున్నారని ఎద్దేవా చేశారు. తనను ఎవరూ గుర్తించడం లేదనే ఫ్రస్ట్రేషన్‌లో రాహుల్ గాంధీని నిందించడాన్ని కేటీఆర్ అలవాటుగా మార్చుకున్నారని ఆమె మండిపడ్డారు. అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన 'ఉచిత బస్సు' వంటి ప్రజా ప్రయోజన పథకాలను కూడా కేటీఆర్ ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. బీజేపీ వైఫల్యాలపై మాట్లాడాల్సి వస్తే కేటీఆర్‌కు వణుకు పుడుతుందని, అందుకే తమ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని, చట్టబద్ధత గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. ముఖ్యంగా మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్ పార్టీ కేసును ప్రస్తావించారు. 'కేటీఆర్ ముందు మీ పార్టీ నాయకుల డ్రగ్స్ దందా గురించి మాట్లాడు. బీఆర్ఎస్ నాయకులు తమ వారసత్వాన్ని ఫామ్‌హౌస్‌లలో డ్రగ్ పార్టీల రూపంలో కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ పార్టీ నేతపై చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, కేటీఆర్ ఈ సంస్కృతిని ఎలా ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతోందని' ఆమె ఘాటుగా విమర్శించారు.తెలంగాణ శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 11.45 గంటలకు ప్రారంభమయ్యాయి. కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఆయన స్పీచ్ పూర్తయ్యాక సభ మరుసటి రోజుకి వాయిదా పడుతుంది. అసెంబ్లీ సమావేశాల ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) భేటీని వేర్వేరుగా నిర్వహించి నిర్ణయం తీసుకుంటారు. మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది.ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న అసెంబ్లీ ఉభయ సభలకు సెలవు ఇచ్చారు.

మార్చి 20న ప్రారంభమయ్యే సమావేశాల్లో అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ బడ్జెట్ 2026ను ప్రవేశపెడతారు. మార్చి 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా సభలకు విరామం ప్రకటించారు. తిరిగి మార్చి 23 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాల్లో బడ్జెట్ పద్దులపై చర్చిస్తారు. వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్పు చేస్తూ చట్టసవరణ, జీహెచ్ఎంసీ చట్టసవరణ, గిగ్‌వర్కర్స్ సంక్షేమం సహా పలు బిల్లులను ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశముంది. ముఖ్యంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ గా మారిన మూసీ పునరుజ్జీవంపై కూడా అసెంబ్లీలో చర్చ జరగనుంది. అంతకుముందు. అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఉదయం 11.27 గంటలకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'


'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# అక్రమ నిర్మాణాలకు..! సెటిల్మెంట్‌లే శరణ్యమా..?

- అక్రమ, నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా టౌన్‌ప్లానింగ్ కాలయాపన..
- బహుదూర్‌పల్లిలోని 1500 గజాల అక్రమ షెడ్డు వ్యవహారంలో నిర్లక్ష్యం..
- ఆ అక్రమ షెడ్డుకు సిఫార్సులకై అధికార పార్టీ యువ నాయకుడు హుకుం.?
- పనుల నిలిపివేతకు వెళ్ళిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం..?
- దొమ్మర పోచంపల్లిలో రెండు భారీ షెడ్లకూ ఆ యువ నాయకుడి సిఫార్సులేనట..
- బౌరంపేట్ అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో మరో అక్రమ షెడ్డు..
- మల్లంపేట్‌లో టౌన్‌ప్లానింగ్ నోటీసులు ఇచ్చిన షెడ్లలో కమర్షియల్ దుకాణాలు..
- దుండిగల్ సర్కిల్ పరిధిలో ఊరూరా అధికార పార్టీ నాయకుల సిఫార్సులేనట..!
- అధికారులు ఎందుకు దండగా పార్టీ నాయకులే కార్యాలయం నడిపితే పోలా..?
- చర్యలు చేపట్టలేక అంతర్గతంగా అధికారులు మదన పడుతున్నట్టు ఆరోపణలు..



బహుదూర్‌పల్లి అక్రమ షెడ్డులో దర్జాగా పనులు..



దొమ్మర పోచంపల్లి పోలీస్ స్టేషన్ వెనుకవైపు.. అక్రమ షెడ్డు..

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారపార్టీ నాయకుల పెత్తనంతో సిఫార్సులు అమలు చేయడానికేనా..? టౌన్‌ప్లానింగ్ అధికారుల విధులు..! గతంలో ఎప్పుడూ బయటకు కనిపించని ఓ యువ నాయకుడు, ఇప్పుడిప్పుడే తనను తాను నిరూపించుకునే పనిలో నిమగ్నమయ్యాడు కాబోలు..! అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునేందుకు తన పలుకుబడిని అంతా బాగానే వినియోగిస్తున్నట్టు స్పష్టమవుతుంది.. ఈ క్రమంలో అక్రమ షెడ్లు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకుండా, అధికారులను వారించడమే పనిగా పెట్టుకుని, సిఫార్సులతో హుకుం జారీ చేస్తున్నట్లు వినికిడి.. బహుదూర్‌పల్లిలో దాదాపు 1500 గజాల భారీ అక్రమ షెడ్డు వ్యవహారంలోనూ ఈ యువ నాయకుని తీరు విచిత్రంగా ఉంది.. అక్రమ షెడ్లకు సెటిల్మెంట్‌లే శరణ్యం, వేరేదారి లేదన్నట్టు వ్యవహరిస్తుండటం, తీవ్ర విమర్శల పాలు అవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. సోమవారం సదరు అక్రమ షెడ్డుపై టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాలతో, పనులు నిలిపివేతకు వెళ్ళిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం..? గతంలో దుండిగల్ విలేజ్‌లోనూ, అధికారపార్టీ నాయకుని అక్రమ షెడ్డు కూల్చివేతల్లోనూ ఈ యువ నాయకుడు సిబ్బందిని ఫోన్ చేసి మరీ హెచ్చరించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 16:

## టౌన్‌ప్లానింగ్ అధికారులెందుకు..? 'టిజి-బిపాస్' చట్టాలెందుకు..?


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59లో టౌన్‌ప్లానింగ్ అధికారులకు సిఫార్సుల తాకిడి తారా స్థాయికి చేరుకుంది.. ఒకవిధంగా చెప్పాలంటే..! చోటామోటా నాయకుల సిఫార్సులకు కూడా తలొగ్గాల్సిన దుస్థితి నెలకొన్నది అనడంలో అతిశయోక్తి కాదు.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో "పెత్తందారీ వ్యవస్థ" మళ్ళీ దాపురించిందా అనిపిస్తుంది.. కొందరు నూతిలోని కప్పలుగా ఉన్నవాళ్ళు కూడా తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ..! ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ..! ఏ పదవులు లేని, కొందరు గల్లీ నాయకులు సైతం, అధికార యంత్రాంగాన్ని శాసించే విధంగా, ప్రభుత్వ పెద్దలే కల్పిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ఇలాంటి పరిణామాలు అధికమైతే ఆయా రాజకీయ పార్టీల మనుగడకు పెను ప్రమాదంగా మారబోతుందని గ్రహించలేక పోతున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు.. సిఫార్సులకు తలొగ్గే అధికార యంత్రాంగం కూడా తమ బాధ్యతలు మరిచి, సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ..! అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం సరైనదేనా..? ఏ ప్రాతిపదికన చర్యలు తీసుకోకుండా నాయకుల ఒత్తిళ్లకు లొంగి పోతున్నారు..? ఈ వ్యవహారంలో అధికారుల లాభాపేక్ష ఏమైనా ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతుతున్నాయి..



బౌరంపేట్‌లో అక్రమ కమర్షియల్ షట్టర్‌ల నిర్మాణం..

నోటీసులు- సీజింగ్‌లు..! యధావిధిగా నిర్మాణ పనులు..! ఆ మాత్రం చర్యలు అవసరమా అనే వారు లేకపోలేదు.. దుండిగల్ సర్కిల్‌లో చైన్‌మెన్‌ల మార్పులు చేర్పులతో వందలాది అక్రమ కట్టడాలు చర్యలు తీసుకోక పెండింగ్‌లో ఉన్నాయి.. మున్సిపల్ నుండి మహానగరంలో విలీనమైనా, ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ సిబ్బందినే చైన్‌మెన్‌లుగా నియమించడం శోచనీయం.. మరోవైపు బిల్ కలెక్టర్‌లుగా ఉన్న సిబ్బందిని చైన్‌మెన్ లుగా నియమించారు.. నూతన చైన్‌మెన్‌లకు కనీసం టౌన్‌ప్లానింగ్ విధుల పట్ల అవగాహన లేదని వారి మాటల్లోనే తెలుస్తుంది.. ఓ చైన్‌మెన్ విధులపై ప్రశ్నిస్తే మేము మొన్ననే వచ్చాం కదా ఇంకా ఏమి శిక్షణ ఇవ్వలేదని చెప్పడం గమనార్హం..








బహుదూర్‌పల్లిలో నోటీసులు జారీ.. యధావిధిగా పనులు..



బహుదూర్‌పల్లి టెక్ మహీంద్రా ఎదురుగా అక్రమ షెడ్డు సీజ్..

టౌన్‌ప్లానింగ్ అండతో బౌరంపేట్ డిపిఎస్ ఎదురుగా అక్రమ భారీ షెడ్డు..




## ఓవైపు అక్రమ షెడ్లకు సిఫార్సులు..! మరోవైపు సెటిల్మెంట్‌లు..?

దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, బాధ్యతలు మరిచి, నాయకుల సిఫార్సులకు, ప్రభావితం అవుతున్నారా..? లేక మరేదైనా కారణాలతో భయపడి వెనకడుగు వేస్తున్నారా..? కారణం ఏమైనప్పటికీ..! అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని పలువురు సూచిస్తున్నారు.. బహుదూర్‌పల్లిలోని అక్రమ భారీ షెడ్డుకు అటు హెచ్ఎండిఏ నుండి, ఇటు దుండిగల్ సర్కిల్ నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా సుమారు 1500 గజాల స్థలంలో భారీ అక్రమ షెడ్డు నిర్మాణాన్ని నిర్మిస్తున్నారు.. గత 10 రోజులుగా ఈ పనులు చేస్తుంటే, అధికారుల మౌనం ప్రశ్నార్థకంగా మారింది..? ఈ షెడ్డు వ్యవహారంలో, అధికార పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు సిఫార్సులతో అధికారుల చర్యలకు అడ్డంకిగా మారాడనే వాదనలు వినిపిస్తున్నాయి.. మరోవైపు తన అనుచరునితో ప్రశ్నించే వారికి "సెటిల్మెంట్‌లు" కూడా చేస్తున్నట్టు తాజా సమాచారం..? ఇంత జరుగుతున్నా అక్రమ షెడ్డు విషయంలో దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. అధికారులకు తెలిసే ఈ అక్రమ షెడ్డుకు సహకరిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..

# సూరారం కాలనీలో.. ఈద్‌కి తోఫా..

## వారాల వినోద్ ఆధ్వర్యంలో ముస్లింలకు బట్టల పంపిణీ..







రంజాన్ సందర్భంగా ముస్లింలకు బటల్లు పంపిణీ..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 16:** కుత్బుల్లాపూర్ నియోజకవ ర్గం 292 డివిజన్ సూరారం కాలనీలోని 60 గజాల ఈద్గా సమీపంలో ఏర్పాటు చేసిన "ఈద్‌కి తోఫా" కార్యక్రమానికి, తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ముఖ్య అతిథిగా పాల్గొన్న వారాల వినోద్ కుమార్ ముస్లిం మైనార్టీ సోదరులకు ఈద్ పండుగ సందర్భంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్ పండుగ సోదరభావానికి ప్రతీక అని, సమాజంలో అన్ని సామాజిక వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించే పండుగగా ఈద్ నిలుస్తుందని అన్నారు. పేద ముస్లిం కుటుంబాలు ఆనందంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో "ఈద్ కి తోఫా" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్ కుమార్, తారా సింగ్, జై భీమ్ నగర్ ప్రెసిడెంట్ భాస్కర్, కృషి కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ కిషోర్ ముదిరాజు, పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మైనార్టీ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు..

## ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై జరిగిన దాడి, అందులో ఆయనతో పాటు ఏపీకి చెందిన ఓ ఎంపీకి కూడా డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్‌గా తేలడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేడు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే మహమ్మారి మూలాలు ఎక్కువగా సినిమా పరిశ్రమలోనే కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే సినిమాల విడుదలకు ముందే నటీనటులందరికీ డ్రగ్స్ టెస్టులు నిర్వహించాలని, అందులో క్లీన్‌గా ఉంటేనే వారి సినిమాలను థియేటర్లలోకి అనుమతించాలని సంచలన ప్రతిపాదన చేశారు. కేవలం సినీ రంగమే కాదు, ప్రజాప్రతినిధులు కూడా సమాజానికి ఆదర్శంగా ఉండాలని... ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ తప్పనిసరిగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవడానికి నిరాకరించే ఏ ప్రజాప్రతినిధినైనా సరే అసెంబ్లీలోకి అడుగుపెట్టనివ్వకూడదని అన్నారు.

## తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కాలరాస్తుంది

-3 పేజి తరువాయి

నల్లమల సాగర్ కు అనుకూలంగా ఏపీ ప్రభుత్వం పెట్టిందన్నారు. గోదావరిలో ఏడు ప్రాజెక్టులకు 400 టీఎంసీల నీళ్లకు అనుమతులు బీఆర్ఎస్ తీసుకొచ్చిందన్నారు. కాళేశ్వరంను చంద్రబాబు అనేక సార్లు అడ్డుకున్నారని చెప్పారు. ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని చంద్రబాబు ఉత్తరాలు రాశారని అన్నారు. క్రిష్ణా,గోదావరి నదీ జలాలపై చర్చకు తాము చర్చకు సిద్ధమన్నారు హరీశ్. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు,ఏపీకి 531 టీఎంసీలు వచ్చాయన్నారు హరీశ్. కేసీఆర్ సీఎం అయ్యాక గోదావరిపై ప్రాజెక్టులు స్టార్ట్ చేశారని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రంలో బడే భాయ్ చోటే భాయ్ బంధం నడుస్తోందని ఆరోపించారు హరీశ్. బీజేపీ,కాంగ్రెస్ పార్టీలది అవిభక్త బంధమని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు పంచుకున్నారని ఆరోపించారు.

## మేడ్చల్ జిల్లాలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

**మేడ్చల్ పెన్ పవర్:**
జీహెచ్ఎంసీ పరిధిలోని 297, 298 డివిజన్లలో మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. గత తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేదని అన్నారు.

## గన్ పార్క్ లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** రైతులకు వెన్నుపోట్లు.. రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు అంటూ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్, అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేసారు.
ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి గవర్నర్ ప్రసంగంలో ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడు మూడో గవర్నర్ ప్రసంగం అవుతుంది.. రెండున్నర సంవత్సరాలు గడిచిపోయింది. ఇప్పటికి ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కల్పించలేదని అన్నారు.
రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అంటే దానికి కారణం ఫైనాన్సియల్ మిస్మేనేజ్మెంట్. తెలంగాణను ఒక ఏటీఎం లాగా మార్చి ఏఐసీసీ పెద్దలకు సమర్పించుకునే శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రజల మీద లేదు, ఈ శాసనసభలో, శాసనమండలిలో తప్పకుండా ప్రతి పేదవాడి తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.
తరువాత ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి శాసనసభ, మండలికి హాజరైయారు.

## గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న సంకల్పానికి ప్రతిబింబం

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు, సంకల్పం మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు స్పష్టమైన ప్రతిబింబంగా నిలిచిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ...తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమం మరియు పారదర్శక పాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలు ప్రస్తావించబడ్డాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు స్పష్టంగా ప్రతిబింబించాయని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా లక్షలాది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి నిర్ణయాలు సామాన్య కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం కలిగిస్తున్నాయని అన్నారు.
రైతుల అభ్యున్నతి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతులపై అప్పుల భారం తగ్గించేందుకు రైతు రుణమాఫీ అమలు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి సాగునీటి వనరుల అభివృద్ధి మరియు ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.
యువత అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు వేగవంతం చేయడంతో పాటు యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువతకు సరైన అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.
యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ తరపున రాష్ట్రంలో క్రీడలకు మరింత
ప్రాధాన్యత కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలు మరియు ప్రోత్సాహక చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.
తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడం, ప్రతి వర్గానికీ సంక్షేమ ఫలితాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు

## పకడ్బందీగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించగా, అనంతరం అధికారికంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్లు, రూమ్ అలాట్‌మెంట్లను సరిచూసుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద దించి, రూమ్ నంబర్లు చూసుకోవడంలో సహాయపడుతూ కనిపించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## పాల్వంచలో ఇఫ్తార్ విందుకు ఎంపి వద్దిరాజు హాజరు

**పాల్వంచ: పెన్ పవర్:** పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాల్వంచ నటరాజ్ చౌరస్తా వద్ద ఉన్న జామామసీద్ లో ఏర్పాటు చేసిన ఈ విందుకు విచ్చేసిన ఎంపీ రవిచంద్ర,వనమా రాఘవలను స్థానిక ముస్లిం మత పెద్దలు పూలమాలలుశాలువాలతో సత్కరించారు. బీఆర్ఎస్ నాయకుడు మల్లెల రవిచంద్ర,ఆయన సతీమణి,37వ డివిజన్ కార్పొరేటర్ స్వప్నకుమారిల ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ విందుకు సుమారు 1,000 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు.

### ఆరు సంవత్సరాల బాలిక అత్యాచారం...హత్య

**రంగారెడ్డి: పెన్ పవర్:** నార్సింగిలో దారుణం జరిగింది. చాక్లెట్ ఇప్పిస్తానంటూ నమ్మించి ఆరు ఏళ్ల బాలికపై కామాంధుడు రేప్ చేసి ఆపై హత్య చేసారదు. బాలిక నిన్న సాయంత్రం నుండి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు తల్లి తండ్రులు నార్సింగి పోలీస్ స్టేషన్ పిర్యాదు చేసారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీటీవీఫుటేజ్ పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్ లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను పసిగట్టి....... హంతకుడిని పట్టుకున్నారు. రాత్రి ఒంటి గంటకు బాలిక మృతదేహాన్ని చూపించాడు. పోలీసులు రేప్ అండ్‌మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మార్చి 19వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధి, శ్రీ పార్థసారథి స్వామివారి సన్నిధి, శ్రీ ఆండాల్ అమ్మవారు, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ పుండరికవల్లీ ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

## మెడికల్ కాలేజీలో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** కటక్లోని ఎస్సీబీ మెడికల్ కాలేజ్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ట్రామాకేర్ విభాగంలో మంటలు చెలరేగి, పది మంది మృతి చెందారు. ప్రమాదంలో మరో 11 మందికి గాయాలు అయ్యాయి. సిబ్బంది రోగులను రక్షించి ఇతర వార్డులకు తరలించారు. దట్టమైన పొగతో 23 మంది సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంపై ఒడిశా సీఎం మోహన్ చరణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను సీఎం పరామర్శించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశించారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్డీపీవో

**హైదరాబాద్ పెన్ పవర్:** 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణములోని పలు స్కూళ్ళ పరీక్షా కేంద్రాలను చిత్తూరు ఎస్డీపీవో టి.సాయినాథ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అధికారులు జిల్లా అంతటా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.
సోమవారం నుండి 10వ తరగతి వారికి పరీక్షలు మొదలైన సందర్భంగా చిత్తూరు ఎస్డీపీవో పట్టణములోని శ్రీచైతన్య, నారాయణ, లిటిల్ ఫ్లవర్ మరియు గిరింపేట లోని మునిసిపల్ హై స్కూల్స్ ల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా హాల్లు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
టి. సాయినాథ్ మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ తరఫున పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసులు పర్యవేక్షణ కొనసాగిస్తారని చెప్పారు.

## బడంగ్ పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**రంగారెడ్డి: పెన్ పవర్:** బడంగ్పేట్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఏసీబీ హైదరాబాద్ రేంజ్ టు డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్ప్రైజ్ చెకింగ్ జరిగింది. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై దాడులు జరిపారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

### ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా

**కూకట్ పల్లి: పెన్ పవర్:** కూకట్ పల్లి ఎంఈఓ కార్యాలయం ఎదుట టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా కు దిగారు. న్యూ ఏరా హై స్కూల్ విద్యాశాఖ అధికారితో కలిసి కుమ్మక్కయ్యారంటూ ఆరోపించారు. న్యూ ఎరా స్కూల్ ర్యాంకుల కోసం సెల్ఫ్ సెంటర్లు వేయించుకున్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ ధర్నా చేసారు. మేడ్చల్ జిల్లా డీఈవో, ఎంఈఓ లంచాలు తీసుకుంటూన్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నినాదాలు చేసారు. ఏరా హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని మార్చాలని డిమాండ్ చేసారు. ఈ తప్పిదానికి పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# పుట్టా మహేష్ ఎపిసోడ్...టీడీపీ సైలెంట్...రీజనేంటి ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏలూరుకు చెందిన టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ హైదరాబాద్ లో ఒక డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఒక్కసారిగా కదిలించింది. ప్రత్యేకంగా టీడీపీలో చూస్తే కనుక ఇది అతి పెద్ద షాకింగ్ గా మారింది. డ్రగ్స్ కేసులో సామాన్య నాయకుడు ఎవరైనా ఇరుక్కుంటే ఆ కథ వేరు, కానీ ఒక పార్లమెంట్ సభ్యుడు ఇందులో ఉన్నారు అన్న ప్రచారం దాని మీద ఆరోపణలు ఇవన్నీ చూసినపుడు తెలుగుదేశం పార్టీలో ఇది అతి పెద్ద చర్చలు దారి తీస్తోంది. అంతర్గతంగానే తీవ్ర స్థాయిలో ఈ ఇష్యూ మీద నాయకుల మధ్య చర్చ సాగుతోంది అని అంటున్నారు.



**కడప నుంచి తెచ్చి:**

ఇదిలా ఉంటే ఎక్కడో కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన పుట్టా మహేష్ కి గోదావరి జిల్లాలలో గుండె కాయ లాంటి ఏలూరు పార్లమెంట్ సీటు ఇవ్వడమే పెద్ద తప్పు అన్నట్లుగా కూడా పార్టీలో అంతర్గత చర్చ సాగుతోంది అని అంటున్నారు. గోదావరి జిల్లాలో ఉన్న స్థానికులను కాదని ఈ సీటు ఎలా ఇస్తారు అని ఆనాడే పార్టీలో ఒక అసంతృప్తి అయితే వ్యక్తం అయింది. కానీ అది ఇపుడు మరోసారి గట్టిగా చర్చకు దారి తీసే స్థాయిలో వినిపిస్తోంది అని అంటున్నారు. స్థానికంగా రెండు సార్లు ఎంపీగా ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి బాబు లాంటి పెద్ద నాయకులు ఉండగా వలసవాదులకు టికెట్లు ఇవ్వాలనుకోవడమే అధిష్టానం నాడు తీసుకున్న ఒక రాంగ్ డెసిషన్ అని చర్చ కూడా సాగుతోంది అంటున్నారు. ఏరి కోరి ఆయనను తెచ్చి మరీ టికెట్ ఇవ్వడం ద్వారానే ఇపుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది అన్న కోణంలోనూ చర్చ సాగుతోంది అని అంటున్నారు.

**కుట్ర జరిగిందా :**

ఇదిలా ఉంటే టీడీపీ అభిమానులు యాక్టివిస్టులు కొంతమంది అయితే సోషల్ మీడియాలో మాత్రం పుట్టా మహేష్ ని సమర్ధిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో మహేష్ కి అన్యాయం జరుగుతోందని, ఆయన బీసీ నేత కావడం వల్లనే ఈ రకంగా చేస్తున్నారు అని కూడా అంటున్నారు. అయితే ఈ కేసు విషయంలో మాత్రం టీడీపీకి అంతా ఇరకాటమైన పరిస్థితి ఉందని అంటున్నారు బయటకు నేతలు ఎవరూ బాహాటంగా ఏదీ చెప్పలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఎలా రియాక్ట్ కావాలి అన్నది కూడా ఎవరికీ అర్ధం కావడం లేదని అంటున్నారు.

**పార్టీకే ట్రబుల్ గా :**

మరో వైపు చూస్తే టీడీపీని అభిమానించే వారి వాదన మరోలా ఉంది. కొందరినాయకులు చేసే తప్పులు పొరపాట్ల వల్లనే పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయని అంటున్నారు. అయినా సరే ఇది సున్నితమైన అంశంగానే పార్టీలో ఉందని చెబుతున్నారు. బీసీ నేత యువ నాయకుడు, మరో సీనియర్ నేతకు బంధువు ఇలా పుట్టా మహేష్ చుట్టూ చాలా విషయాలు కోణాలు ఉన్నాయి. దాంతో ఎవరూ బయటపడి గట్టిగా అనే పరిస్థితి లేదని కూడా గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో బీసీ నేత మీదకు గురి పెడతారా అని వైసీపీ లాంటి ప్రత్యర్ధి పార్టీల మీద విరుచుకు పడాలనుకున్నా ఈ కేసు క్లియర్ కట్ గా ఇపుడు కనిపిస్తోంది అని అంటున్నారు.

**బెయిల్ ఇచ్చినా కూడా :**

ఇక ఈ కేసు విషయంలో ఎంపీగా పుట్టా మహేష్ కి పోలీసులు తాత్కాలికంగా బెయిల్ ఇచ్చారని అంటున్నారు. ఎందుకు అంటే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. కాబట్టి ఎంపీగా సభకు హాజరయ్యేందుకు ఆయనకు ఈ బెయిల్ వచ్చింది అని చెబుతున్నారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ లో పార్టీగా టీడీపీయే కార్నర్ అవుతోంది అని అంటున్నారు సమాధానం చెప్పుకోలేని స్థితిలోకి పార్టీ వెళ్తోంది అన్న ఆవేదన కూడా చాలా మంది పార్టీ నేతలలో ఉంది. అందుకే పార్టీలో ఒక రకమైన సైలెంట్ కనిపిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈ తరహా పరిణామాలతో టీడీపీ కానీ కూటమి నేతలు కానీ ప్రస్తుతానికి మౌనంగానే ఉంటూ వస్తున్నారు. ఈ ఇష్యూలో ఏమి జరుగుతుంది ఎటు మలుపు తిరుగుతుంది అన్నది అయితే చూడాల్సి ఉందని అంటున్నారు.

# జగన్ సొంత రాజకీయాలు...

**విజయవాడ, మార్చి 16, పెన్ పవర్:**
వైసీపీ అధినేత జగన్ కోటరీని పక్కన పెట్టాలని ఆ పార్టీలో .. పై స్థాయి నేతల నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ కోరుకుంటున్నారు. జగన్ నేరుగా అందరితో టచ్ లో ఉండకపోవచ్చు కానీ అసలు మొత్తం ఆయన తరపున కోటరీలోకీలక వ్యక్తులుగా చెలామణి అవుతున్న నేతలే చక్కబెడుతున్నారు. జగన్ కు తెలుస్తుందో లేదో కూడా క్యాడర్ కు తెలియడం లేదు. అయితే రెండు రోజుల కిందట జరిగిన ఆవిర్భావ దినోత్సవం రోజున కొద్ది సేపే అయినా స్క్రిప్ట్ లేకుండా ప్రసంగించడం, ఆ కార్యక్రమంలో ఆయన పక్కన కోటరీ నేతలెవరూ లేకపోవడం పార్టీ క్యాడర్ లో ఆశలు నింపుతోంది. వైసీపీ ఆవిర్భావ దినోత్సవం వేదికగా జగన్ తీరులో కనిపిస్తున్న మార్పు ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ అయ్యింది. సాధారణంగా జగన్ అంటేనే చుట్టూ ఒక ప్రత్యేక కోటరీ ఉంటుంది. ఆ కోటరీని దాటుకుని సామాన్య కార్యకర్త వెళ్లడం అసాధ్యమనే ముద్ర పడిపోయింది. గత ఐదేళ్లుగా జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆ ముగ్గురు నలుగురు కీలక నేతల పాత్రే ఎక్కువగా ఉందనే అసహనం పార్టీలో ఉంది. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు జగన్ దృష్టికి వెళ్లకుండా ఈ కోటరీ అడ్డుపడుతోందని సీనియర్ నేతలు సైతం లోలోపల మదనపడుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ అసంతృప్తి మరింత పెరిగింది. కోటరీకి ఉన్న అతి సాన్నిహిత్యం వల్ల పార్టీ నేతల మధ్య దూరం పెరిగిందని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు జగన్ ఈ వర్గాన్ని పక్కన పెడుతున్నట్లు కనిపిస్తుండటం కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. సాధారణంగా జగన్ ప్రసంగాలు పక్కాగా రాసి పెట్టుకున్న కాగితాల చుట్టూ సాగుతుంటాయి. కానీ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన ఏ కాగితం చూడకుండా మనసులో ఉన్నది మాట్లాడారు. ఇది నాయకత్వ శైలిలో మార్పును సూచిస్తోంది. నేరుగా ప్రజలతో కార్యకర్తలతో కనెక్ట్ అవ్వాలంటే మధ్యలో సలహాదారులు ఉండకూడదని జగన్ గుర్తించినట్లు కనిపిస్తోంది. కోటరీ చెప్పే లెక్కల కంటే కార్యకర్తల ఆవేదన



వింటేనే పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆయన భావిస్తున్నట్లు ఈ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. కేవలం ఒక రోజు వేడుకతోనే ఈ మార్పు ఆగిపోతే ఫలితం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. సలహాదారులు ఇచ్చే సమాచారంపైనే ఆధారపడకుండా జిల్లాల వారీగా ముఖ్య నేతలు కింది స్థాయి కార్యకర్తలతో జగన్ నేరుగా టచ్ లో ఉండాలి. లోటస్ పాండ్ లో లేదా తాడేపల్లిలో గదుల మధ్య జరిగే సమీక్షల కంటే క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని క్యాడర్ ఆశిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచారని కోటరీని దూరంగా పెట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకుడి చుట్టూ ఉండే వ్యక్తుల కంటే జెండా మోసే కార్యకర్తలే శ్రీరామరక్ష అని జగన్ కి ఆలస్యంగానైనా అర్థమైందన్న భావన వ్యక్తమవుతోంది. జగన్ తనంతట తానుగా బయటకు వచ్చి ప్రజలతో మమేకమైతే అటు ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలోనూ ఇటు పార్టీని బలోపేతం చేయడంలోనూ వేగం పెరుగుతుందని అనుకోవచ్చు. మరి ఇదే పద్ధతిని ఆయన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తారా లేక మళ్లీ పాత సలహాదారుల మాయలో పడతారా అన్నది వేచి చూడాలి.

# జనసేన వర్సెస్ టీడీపీ

**కాకినాడ, మార్చి 16, పెన్ పవర్:**
పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ "శాశ్వత ఎమ్మెల్యే" వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పిఠాపురంలో శుక్రవారం జరిగిన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులే కూటమి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఇది కేవలం తనను మాత్రమే కాకుండా, మూడు పార్టీల నాయకులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించడం తగదని సూచిస్తూ, అధికారుల తీరుకు నిరసనగా ఆయన సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. వర్మకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు కూడా అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.పిఠాపురంలో వర్మ బలమైన నాయకుడు. గతంలో ఓసారి పార్టీ టికెట్ రాకపోతే ఆయన ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచారు. పిఠాపురం నియోజకవర్గాన్ని బలమైన నియోజకవర్గంగా మార్చారు వర్మ. అయితే రాష్ట్ర స్థాయిలో పవన్ కళ్యాణ్ తో టిడిపికి పొత్తు అవసరం. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కు ఒక నియోజకవర్గం అవసరం వచ్చింది. అంతకుముందు ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో 2024లో జాగ్రత్త పడ్డారు. అలా పిఠాపురం పై దృష్టి పడడంతో వర్మను సైడ్ చేయాల్సి వచ్చింది. బలమైన నాయకుడు కావడంతో ఆయన సాయం తీసుకోవాలని భావించి ప్రాధాన్యమిచ్చారు వర్మకు.. అయితే బలమైన హామీతోనే అప్పట్లో వర్మ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం ఉంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రోజురోజుకు వర్మలో అసహనం పెరుగుతోంది. టిడిపి నాయకత్వం సైతం వర్మ విషయంలో నిస్సహాయతతో ఉంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పిఠాపురం నియోజకవర్గం లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వర్మ కు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆపై పిఠాపురం నియోజకవర్గంలో అధికార పార్టీగా సరైన గౌరవం దక్కడం లేదు.

# కొబ్బరికి యుద్ధ కష్టాలు

**కాకినాడ, మార్చి 16, పెన్ పవర్:**
కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కువుగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18–20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు.దీంతో ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.13–14 వేలకు పతనమయ్యాయని వ్యాపారులు రైతులు అంటున్నారు. ఏపీలో కొబ్బరికి ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా అంబాజీపేటలో కొబ్బరికి పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నుంచి రోజు ఇతర రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీలు ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎగుమతులు పూర్తిగా పడిపోయి కొబ్బరి పచ్చికాయ కురిడికాయ ధరలు అమాంతంగా పడిపోవడంతో అటు వ్యాపారులు ఇటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఉత్థానం ప్రజలకు భారీ ఊరట

**శ్రీకాకుళం, మార్చి 16, పెన్ పవర్:** చాలా ఏళ్లుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు ఒక గొప్ప శుభవార్త అందింది. పలాసలో ఉన్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ , సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తొలిసారిగా ఒక కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చాలా విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్ ద్వారా సోంపేటకు చెందిన ఒక యువతికి కొత్త జీవితం దొరికింది. ఒక మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ కూడా లేని చోట ఇలాంటి పెద్ద ఆపరేషన్ జరగడం ఆ ప్రాంత ప్రజలకు భారీ ఊరటగానే చెప్పవచ్చు. సోంపేటకు చెందిన సీహెచ్ హేమ శ్రీ అనే యువతి గత కొంత కాలంగా రెండు కిడ్నీలు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతోంది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన తండ్రి మోహన్ రావు తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొదలైన ఆపరేషన్ సుమారు మధ్యాహ్నం 3 గంటల వరకు అంటే నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగింది.. డాక్టర్లు చాలా కష్టపడి ఈ ఆపరేషన్ విజయవంతం చేశారు. ప్రస్తుతం హేమశ్రీ కిడ్నీ బాగానే పని చేస్తోందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. అయితే ఆపరేషన్ తర్వాత ఇచ్చే జాగ్రత్తల్లో భాగంగా మరో 15 రోజుల పాటు ఆమెకు వైద్యసేవలు అందిస్తామని డాక్టర్లు తెలిపారు. ఈ ఆపరేషన్ వెనుక ఒక పెద్ద డాక్టర్ల టీమ్ కృషి ఉంది. కేజీహెచ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఈ టీమ్‌కు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలాస వంటి చిన్న ప్రాంతంలో ఇలాంటి ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారి అని గర్వంగా చెప్పారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి చెందిన సీనియర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు కూడా ఈ టీమ్‌లో కీలక పాత్ర పోషించారు. వీరితోపాటు డాక్టర్లు పూర్ణచంద్ర, వివేకానంద, అశోక్‌వర్ధన్, జోగినాయుడు, స్థానిక వైద్యులు రాకేష్, జ్యోత్స్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ జే కిశోర్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అనేవి ఒక పెద్ద సమస్యగా ఉన్నాయి. గతంలో ఇలాంటి ఆపరేషన్లు కావాలంటే విశాఖ, కర్నూలు, గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. పలాసలో ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంత్కో్టలు జరుగుతోంది. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి సదుపాయాలు ఉండటం గొప్ప విషయమని డాక్టర్ ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఈ ఆసుపత్రి నిర్మాణం అభివృద్ధిపై నాయకులు స్పందించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఆసుపత్రి నిర్మిస్తే నేడు కూటమి ప్రభుత్వంలో కిడ్నీ మార్పిడి చికిత్సకు చర్యలు చేపట్టినట్టు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాతల సహాయంతో పది కొత్త డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని వైద్య పరికరాల కోసం 9 కోట్లు రూపాయలు, పరిశోధనల కోసం 3 కోట్ల రూపాయలు కేటాయించినట్టు వెల్లడించారు.

# ఏపీ బీజేపీకి ఏమైంది...

**విజయవాడ, మార్చి 16, పెన్ పవర్:** జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీ దూకుడుగా ఉంది. చాలా దూకుడుగా ముందుకు వెళ్తోంది. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. పివిఎన్ మాధవ్ పగ్గాలు తీసుకున్నాక పరిస్థితుల్లో మార్పు ఉంటుందని అంతా భావించారు. ఆయన కూడా బాధ్యతలు తీసుకున్నాక చాలా వేగంగా పావులు కదిపారు. కానీ ఎందుకో ఇటీవల ఫుల్ సైలెన్స్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా తగ్గాయి. ముఖ్యంగా పార్టీలో కార్యవర్గ విభాగాల ఏర్పాటు కూడా జరగలేదు. పక్కనే ఉన్న తెలంగాణలో కొత్త కార్యవర్గాలను ప్రకటించారు. కొత్త కొత్త నేతలకు ఛాన్స్ ఇచ్చారు. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏమో కూటమిలో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి పరిస్థితి.మొన్నటి ఎన్నికల్లో ఓట్లతో పాటు సీట్లను పెంచుకుంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీ తరపున ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలిచారు. ముగ్గురు లోక్సభ సభ్యులు అయ్యారు. కేంద్రమంత్రిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఉన్నారు. రాష్ట్ర మంత్రిగా సత్య కుమార్ యాదవ్ ఉన్నారు. మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఎమ్మెల్సీ అయ్యారు. ఎంపీలుగా పురందేశ్వరి, సీఎం రమేష్.. ఎమ్మెల్యేలుగా విష్ణుకుమార్ రాజు, సుజనా చౌదరి వంటి సీనియర్లు కొనసాగుతున్నారు. అయినా సరే పార్టీకి ఒక ఊపు తేలేకపోతున్నారు. దీనికి ఏం కారణం అనేది ఇప్పుడు ఒక ప్రశ్న. పొత్తుతో ముందుకు వెళ్తున్నారు సరే. కానీ పార్టీ కార్యక్రమాల విషయంలో సైతం వెనుకబాటు కనిపిస్తోంది. ఇది పార్టీ శ్రేణులకు అంతుపట్టడం లేదు. పార్టీ బలోపేతం అనేది భవిష్యత్తు కలగానే మిగిలిపోతోంది.భారతీయ జనతా పార్టీ ఇప్పటిది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించే సమయానికి ఏపీలో ఎంటర్ అయింది ఆ పార్టీ. ఉమ్మడి ఏపీలో విశాఖ మహానగరంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్ పదవిని సొంతం చేసుకుంది బిజెపి. అటు తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. అంతకంటే ముందే విజయాన్ని దక్కించుకున్న బీజేపీ మాత్రం వెనుకబడిపోయింది. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉంటే పదుల సంఖ్యలో సీట్లు దక్కించుకుంటోంది. లేకుంటే ఉనికి చాటుకోవడానికి కూడా ఇబ్బంది పడుతోంది. ఈ పరిస్థితి దశాబ్దాలుగా మారడం లేదు. నాయకత్వాలు మారినా సరైన ఫలితం దక్కడం లేదు బిజెపికి. యావత్తు భారతదేశాన్ని ఆవహిస్తున్న బిజెపి.. ఏపీలో ఎందుకు వెనుకబడిపోతుంది అనేది ఇప్పటికీ ధర్మసందేహమే.

## మూడు రాజధానులతో జగన్..

## మూడు పార్టీలతో పవన్

**నెల్లూరు, మార్చి 16, పెన్ పవర్:** ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు తర్వాత ఎవరు అంటే కచ్చితంగా జగన్, పవన్, లోకేష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఎందుకంటే ఆ ముగ్గురు ఎవరికి వారే ముద్ర చూపుకున్నారు. అయితే ప్రధానంగా జగన్ తో పాటు పవన్ రాజకీయ పార్టీలు ప్రారంభించి తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆ ఇద్దరు నేతలది విభిన్నం. ఇద్దరూ తలోదారి తో ముందుకు సాగుతున్నారు. ఒకరు ఓటమితో ప్రస్థానాన్ని ప్రారంభించి.. గెలుపును అందుకున్నారు. మరొకరు విపరీతమైన సెంటిమెంట్ ప్రభావంతో గెలుపును అందుకొని.. భారీ ఓటమి మూటగట్టుకున్నారు. ఇద్దరికీ స్పష్టమైన తేడా ఉంది. అయితే పవన్ ఒక పద్ధతి ప్రకారం రాజకీయం చేస్తుండగా.. జగన్ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసుడిగా కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పొలిటికల్ ఎంట్రీ అదుర్స్ అనిపించారు జగన్మోహన్ రెడ్డి తండ్రి అకస్మిక మరణంతో వచ్చిన సెంటిమెంటును గుర్తించి ఓదార్పు యాత్రతో తనకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే ఒక రకమైన దూకుడు రాజకీయాన్ని అలవాటు చేసుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తరువాత పూర్తిగా పొలిటికల్ సీన్ మారిపోయింది. అప్పటివరకు ఉన్న రాజకీయ హుందాతనం పూర్తిగా మారిపోయింది. రాజకీయ వికృత క్రీడతో వ్యక్తిత్వ హరణం మొదలైంది అప్పటి నుంచే.అసలు రాజకీయాలతో సంబంధం లేని మహిళలను రాజకీయ వేదికలు ఎక్కించారు. వారితో సాటి మహిళలను ఆ గౌరవంగా మాట్లాడించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# 10 రోజులా 20 రోజులా.. సభా సమరంపై పట్టు!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలన్న విషయంపై అధికార, ప్రధాన ప్రతి పక్షాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. పది రోజుల కన్నా ఎక్కువ సమయం కేటాయించలేమని ప్రభుత్వం పేర్కొంది. కానీ, ప్రధాన ప్రతిపక్షం మాత్రం.. పది రోజులు కాదు.. 20 రోజులు నిర్వహించాల్సిందేనని తేల్చి చెబుతోంది. అయితే.. ఈ విషయంపై మంగళవారం నిర్వహించనున్న బీఏపీ సమావేశంలో నిర్ణయిద్దామని అధికార పక్షం చెబుతోంది.

### పదిరోజులు అయితే..

రాష్ట్ర సర్కారు పది రోజుల వరకే సభను నిర్వహించడంపై దృష్టి పెట్టింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై 4 రోజులు.. సమయం ఇస్తారు. అనంతరం కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు మరో రెండు రోజులు కేటాయిస్తారు. మధ్యలో బడ్జట్ ప్రసంగం.. సహా ఇతర కార్యకలాపాలు ఉంటా యని చెబుతోంది. అదేసమయంలో సెలవులను కూడా దృష్టిలో పెట్టుకుంటే.. పది రోజులు సరిపోతాయని అధికార పక్షం తేల్చి చెబుతోంది. కానీ.. 20 రోజుల పాటు సభను కొనసాగించాలని.. తద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టుబడుతోంది. గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం, ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించడం వంటి అంశాలకు మాత్రమే పరిమితం కారాదని.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించాలని కేటీఆర్ సహా హరీష్ రావు.. తాజాగా మంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మూసీ నది ప్రక్షాళనపై పెద్ద ఎత్తున చర్చించాలని కోరుతున్నారు. అమలు కాని ఆరు గ్యారెంటీలు సహా.. సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం.. ఐఏఎస్ అధికారిపై వచ్చిన ఆరోపణలు.. వంటి కీలక అంశాలను ప్రస్తావిస్తోంది. ఇక మరీ ముఖ్యంగా తమ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశాన్ని కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రస్తావిస్తున్నారు. అయితే.. రాష్ట్ర సర్కారు మాత్రం.. సమస్యలపై ఈ 10 రోజుల్లోనే చర్చిద్దామని.. వీటితోపాటు డ్రగ్స్ వ్యవహారంపైనా చర్చిద్దామని చురకలు అంటిస్తుండడం గమనార్హం.

# తైవాన్ పై తాడోపేడో..! దీవ్పాన్ని చుట్టుముట్టిన చైనా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం.. మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం.. ఇంకోవైపు ఇజ్రాయెల్–అమెరికా వర్సెస్ ఇరాన్... ఇది చాలదన్నట్లు మిస్సైళ్ల ప్రయోగంతో ఉత్తర కొరియా దూకుడు.. అదీ సరిపోదన్నట్లు తైవాన్ ను భయపెడుతోంది చైనా. అసలు ఆ ద్వీపం జోలికెళ్తే తోక తొక్కిన తాచుపాములా లేస్తుంది డ్రాగన్..! వన్ చైనాలో భాగం అంటుంది. మరి ఎందుకనో కానీ, కొన్నాళ్లుగా తైవాన్ విషయంలో చైనా కామ్ గా ఉంది. తాజాగా మాత్రం ఒక్కసారిగా జూలు విదిల్చింది. ప్రపంచ పరిణామాల కారణంగానే ఏమో కానీ.. తైవాన్ మాది అని చాటి చెప్పేలా చేసింది. దాదాపు మూడేళ్ల కిందట చైనా.. తైవాన్ ను దాదాపు కబళించినంత పనిచేసింది. అంతకుమందు అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ లో పర్యటించడాన్ని చాలా సీరియస్ గా తీసుకుంది. ఆ తర్వాత తైవాన్ లో తమ వ్యతిరేకి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటవడం డ్రాగన్ కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

### ఎక్కడుందీ తైవాన్..?

తైవాన్ ఒక ద్వీపం. తమ దేశానికి సమీపంలో ఉండే దీనిని తమదే అంటుంది చైనా. కానీ, తమకు స్వతంత్రత ఉందని అంటుంది తైవాన్. ఈ ద్వీపం గురించి ఎవరైనా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరిస్తుంటుంది. అయితే, తైవాన్ కు అమెరికా పూర్తి మద్దతు ఉంది. అందుకే, ఏమాత్రం తేడా వచ్చినా తైవాన్ ను కలిపేసుకుంటాం అని చైనా హెచ్చరిస్తుంటుంది.

### అక్కడ నిత్యం విమానాల మోతనే...

తైవాన్ ను తరచూ భయపపెట్టడం చైనాకు అలవాటు. గతంలో ఆ ద్వీపం చుట్టూ అనేకసార్లు యుద్ధ విన్యాసాలు కూడా చేసింది. తాజాగా తైవాన్ ఎయిర్ స్పేస్ లోకి యుద్ధ విమానాలను పంపింది. ఇరాన్ యుద్ధం ప్రారంభానికి ముందు తైవాన్ విషయంలో చప్పిడి చేయని చైనా.. అకస్మాత్తుగా తాజా చర్యకు దిగడం గమనార్హం. దీనికి కారణం ఏమిటా? అని రక్షణ రంగ నిపుణులు విశ్లేషణ చేస్తున్నారు. శనివారం 26 చైనా యుద్ధ విమానాలు తమ ద్వీపం చుట్టూ చక్కర్లు కొట్టినట్లు తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ చెప్పారు. జలసంధిలో ఏడు నౌకలనూ గుర్తించామన్నారు.

### చుట్టుముట్టినట్లేనా?

తైవాన్ ను చైనా చుట్టుముట్టిందనే కథనాలు వస్తున్నాయి. సందట్లో సడేమియాలాగా ఈ ద్వీపాన్ని కలిసేకుంటుందా? అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఎందుకంటే, ఇరాన్ తో యుద్ధంలో తలమునకలైన అమెరికా.. తైవాన్ విషయంలో జోక్యం చేసుకోదు. రష్యా మద్దతు ఎలాగూ చైనాకే. కాబట్టి, తన విషయంలో ఎవరూ వేలు పెట్టరని డ్రాగన్ అంచనా వేస్తుందా? అనే అనుమానాలు వస్తున్నాయి.

# వ్యవసాయం మొదలు పెట్టిన విజయసాయిరెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. రాజకీయాల నుంచి దూరంగా ఉంటానని ప్రకటించిన ఆయన ఇప్పుడు పూర్తిగా వ్యవసాయంపై దృష్టి సారించినట్లు కనిపిస్తున్నారు. నెల్లూరులో తన సొంత వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తూ కనిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు కీలక నాయకుడిగా ఎదిగిన విజయసాయిరెడ్డి, పార్టీ స్థాపించిన దశ నుంచే పనిచేశారు. ముఖ్యంగా ఆ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందారు. వైఎస్ కుటుంబానికి ఆడిటర్‌గా సేవలు అందించిన ఆయన ఆ పరిచయంతోనే జగన్‌కు దగ్గరయ్యారు. జగన్‌పై నమోదైన అవినీతి, అక్రమాస్తుల కేసుల్లో కూడా ఆయన నిందితుడిగా నిలిచారు. ఆ కేసుల నేపథ్యంలో జగన్‌తో కలిసి సుమారు 16 నెలల జైలు జీవితం గడిపిన విషయం తెలిసిందే.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో విజయసాయిరెడ్డి కీలక పాత్ర పోషించారు. పార్టీలు, రాజకీయ కార్యక్రమాల్లో ఆయన చురుకైన పాత్రతో జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. అయితే ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ఆయనకు జగన్‌తో విభేదాలు వచ్చినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత పార్టీకి గుడ్‌బై చెప్పిన విజయసాయిరెడ్డి రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పారు.

రాజకీయాలకు విరామం ప్రకటించిన అనంతరం ఆయన వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టారు. సొంత జిల్లా నెల్లూరు శంకరాపురం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో తానే ప్రత్యక్షంగా అప్పుడప్పుడు రైతులతో కలిసి పనిచేస్తున్న సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు కూడా పంచుకున్నారు.

అయితే కొద్ది కాలం తర్వాత మళ్లీ రాజకీయాలపై ఆసక్తి చూపినట్లు కనిపించారు. మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరుకావడం, రాజకీయంగా మళ్లీ ఉండటం సంకేతాలు ఇవ్వడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరే అవకాశాలపై కూడా అప్పట్లో చర్చలు జరిగాయి.

ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా మరోసారి ఆయన వ్యవసాయంలో నిమగ్నమైన దృశ్యాలు వెలుగులోకి రావడం ఆసక్తికరంగా మారింది. నెల్లూరు జిల్లా శంకరాపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో మిరప పంటకు సేంద్రీయ ద్రావణం స్ప్రే చేస్తూ కనిపించారు. 'అగ్నాస్త్రం' అంటే సేంద్రీయ ద్రావణం తయారీ విధానం కూడా ఆయన వీడియోలో వివరించారు. సాగులో వచ్చే చీడపీడలను సహజసిద్ధంగా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.సమాజంలో చెడు ఎలా తొలగించాలన్నదే రాజకీయాల లక్ష్యమైతే, సాగులో చీడపీడలను తొలగించడం

కూడా ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రాజకీయాల నుంచి వ్యవసాయానికి, మళ్లీ రాజకీయాల వైపు, తిరిగి వ్యవసాయానికి వచ్చిన విజయసాయిరెడ్డి ప్రయాణం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చలకు దారితీస్తోంది.

# ట్రంప్ మాటకు నో.. తోలుబొమ్మలం కాదని తేల్చేసిన మిత్రదేశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** నేనేం అనుకుంటే అదే జరుగుతుంది. అగ్రరాజ్య అధినేత హోదాను ఇష్టారాజ్యంగా వాడేసిన డొనాల్డ్ ట్రంప్ కారణంగా.. ఈ రోజున ప్రపంచంలో అస్థిర పరిస్థితులు మాత్రమే.. ఆర్థిక అనిశ్చితికి కారణమైంది. ప్రపంచం కోరుకోని యుద్ధాన్ని ట్రంప్.. ఇజ్రాయెల్ అధినేతల కారణంగా మొదలు కావటం.. యావత్ ప్రపంచం ఏదో రూపంలో కిందా మీదా పడటం తెలిసిందే. ఇది సరిపోదన్నట్లు.. ఇరాన్ అధీనంలో ఉండే హర్మూజ్ జలసంధి వద్దకు మిత్రులు రావాలని..ఇరాన్ సంగతి చూడాలన్నట్లుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు.. మిత్ర దేశాలు ఎవరూ స్పందించని పరిస్థితి. అంతేనా.. తాము హర్మూజ్ జలసంధి వద్దకు రాలేమన్న విషయాన్ని ఆయా దేశాలు స్పష్టం చేశాయి.ఇరాన్ యుద్ధంతో దెబ్బ తిన్న హర్మూజ్ ను సురక్షితంగా ఉంచేందుకు వీలుగా.. అక్కడ ఇంధన రవాణాను క్రమబద్ధికరించేందుకు యుద్ధనౌకల్ని మోహరించాలని ట్రంప్ ఏడు మిత్ర దేశాల్ని కోరారు. ఇదిలా ఉండగా.. ఆయన పిలుపును ఏడింటిలో రెండు దేశాలు (ఆస్ట్రేలియా, జపాన్) రిజెక్టు చేశాయి. తాము ఎలాంటి నౌకల్ని పంపమని తేల్చేశాయి. హర్మూజ్ వద్దకు తాము ఎలాంటి నౌకల్ని పంపటం లేదని ఆస్ట్రేలియా వెల్లడించింది. మారిటైమ్ సెక్యూరిటీ ఆపరేషన్లను పరిగణలోకి తీసుకోమని జపాన్ స్పష్టం చేసింది.ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. పశ్చిమాసియాలోని చమురుపై ఆధారపడేన దేశాలు హర్మూజ్ ను సేవ్ చేసేందుకు ముందుకు రావాలని ఒత్తిడి చేసినట్లుగా పేర్కొన్నారు. అయితే..ఆఏడు దేశాల వివరాల్ని మాత్రం వెల్లడించలేదు. అయితే.. ట్రంప్ ప్రకటన తర్వాత స్పందించిన దేశాల్ని చూస్తే.. విషయం ఇట్టే అర్థమవుతుంది. అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశాలైన జాపాన్, ఆస్ట్రేలియాలు యుద్ధ నౌకల్ని పంపే ప్రణాళికలు ఏమీ లేవని స్పష్టం చేయటం ద్వారా.. షాకిచ్చాయని చెప్పాలి.ఉక్రెయిన్ – రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంతో ఇప్పటికే ఆర్థికంగా.. సైనిక పరంగా ఇబ్బందుల్లో ఉన్న యూరోపియన దేశాలు.. ఇరాన్ తో నేరుగా ఘర్షణకు దిగేందుకు సిద్ధంగా లేవని చెబుతన్నారు. నాటో కూటమిని ట్రంప్ హెచ్చరించిన వైనాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. నాటో భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న ఆయన వార్నింగ్ నాటో దేశాల మీద ఎలాంటి ప్రబావాన్ని చూపలేదు. ఇది అంతర్జాతీయంగా అమెరికా పట్టు తగ్గుతుందన్న దానికి ఒక సంకేతమన్న చర్చ మొదలైంది.గతంలో అమెరికా పిలుపునిస్తే.. స్పందించే దేశాలు ఇప్పుడు తమ సొంత భద్రత.. ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వటం చూస్తే.. ట్రంప్ తరచూ ప్రస్తావించే అమెరికా ఫస్ట్ పాలసీకి దాని మిత్రదేశాలు ఇస్తున్న కౌంటర్ గా తాజా పరిణామాల్ని విశ్లేషిస్తున్నారు

ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకించిన జపాన్.. ఆస్ట్రేలియాతో పాటు.. బ్రిటన్, దక్షిణ కొరియా, చైనాలు కొట్టిపారేశాయి. జలసంధించిన తిరిగి తెరవాల్సిన అవసరం ఉందని చెప్పిన బ్రిటన్ ప్రధాని.. తమ మిత్రదేశాలతో కలిసి ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తున్నట్లుగా చెప్పారు. చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న చైనా.. అందుకు తగ్గట్లు యుద్ధాన్నివెంటనే ఆపాలని కోరటం గమనార్హం. మొత్తంగా ట్రంప్ పిలుపునిచ్చినంతనే.. అదేపనిగా హడ్జవుడి చేయకుండా.. తమ దేశ ప్రయోజనాలకు ఎంత మేలు జరుగుతుందన్న అంశానికే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్న అంశం తాజా ఎపిసోడ్ స్పష్టం చేస్తుందని చెప్పాలి.

# 30 ఏళ్లకే అబ్బాయిలు అంకుల్స్ అయిపోతున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తన కూతురికి తగిన వరుడు దొరకడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ చేసిన వీడియో, నేటి తరం యువత జీవనశైలి మరియు పెళ్లి సంబంధాల్లో ఎదురవుతున్న సవాళ్లను మరోసారి చర్చకు పెట్టింది. ఆ వివరాలు చూద్దాం.. ఈ రోజుల్లో చదువు, ఉద్యోగం అంటూ సెటిల్ అయ్యేసరికి వయసు ముప్పై దాటుతోంది. సరిగ్గా ఇదే సమయంలో పెళ్లి సంబంధాలు చూస్తుంటే.. అబ్బాయిలు అంకుల్స్‌లా కనిపిస్తున్నారంటూ ఓ యువతి తల్లి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నాయి. తన కూతురికి తగిన వరుడు దొరకడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ చేసిన వీడియో, నేటి తరం యువత జీవనశైలి మరియు పెళ్లి సంబంధాల్లో ఎదురవుతున్న సవాళ్లను మరోసారి చర్చకు పెట్టింది. ఆ వివరాలు చూద్దాం.. సాధారణంగా బాగా చదువుకున్న అమ్మాయిలకు తగిన జోడిని వెతకడం తల్లిదండ్రులకు పెద్ద సవాలుగా మారుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలో ఉన్న తల్లి తన కుమార్తె వీదీదీూ మరియు వీణ పూర్తి చేసిందని, ఆమె స్థాయికి తగ్గ అబ్బాయి కోసం వెతుకుతున్నామని చెప్పారు. అయితే చదువు, హోదా అన్నీ కుదిరినా.. అబ్బాయిల రూపురేఖల విషయంలో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం చదువు మాత్రమే కాదు, తన కూతురి పక్కన వరుడు కూడా అంతే అందంగా ఉండాలని ఆమె కోరుకుంటున్నారు.

### అబ్బాయిలు అంకుల్స్‌లా కనిపిస్తున్నారు:

ఇక ఆ తల్లి చేసిన ప్రధాన విమర్శ ఏమిటంటే, 32 నుండి 34 ఏళ్ల వయసున్న అబ్బాయిలు కూడా చూడటానికి అంకుల్స్‌లా ఉంటున్నారని. దీనికి ప్రధాన కారణాలుగా బట్టతల రావడం లేదా విపరీతంగా బరువు పెరగడం వంటివి ఆమె పేర్కొన్నారు. ముప్పై ఏళ్లకే అబ్బాయిలు తమ ఫిట్‌నెస్‌ను కోల్పోతున్నారని, తన కూతురు పక్కన వారు వయసులో చాలా పెద్దవారిలా కనిపిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మాటలు కొంతమందికి కోపం తెప్పిస్తున్నా, మరికొందరు మాత్రం నిజమే కదా అని ఆలోచనలో పడుతున్నారు.

### చదువుకు తగ్గ అందం.. అందానికి తగ్గ హోదా:

ఇక అందంగా ఉన్న అబ్బాయిలను చూస్తే వారు తన కూతురి చదువు స్థాయికి సరిపోవడం లేదని, ఒకవేళ చదువుకున్న వారిని చూస్తే వారు ఫిట్‌గా ఉండటం లేదని ఆ తల్లి వాపోతున్నారు. అంటే నేటి పెళ్లిళ్ల మార్కెట్‌లో కేవలం సంపాదన, ఆస్తి మాత్రమే కాదు.. ఫిజికల్ అప్పియరెన్స్ కూడా చాలా కీలక పాత్ర పోషిస్తోందని ఈ ఘటన నిరూపిస్తోంది. సాఫ్ట్‌వేర్ లేదా ఇతర రంగాల్లో పని ఒత్తిడి వల్ల అబ్బాయిలు తమ ఆరోగ్యాన్ని, ఆకారాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే చర్చకు ఇది దారితీసింది.

### మారాల్సిన జీవనశైలి:

ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్ల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ తల్లిని విమర్శిస్తుంటే, మరికొందరు మాత్రం అబ్బాయిలు హెల్త్ పట్ల కేర్ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక ఏదేమైనా, 30 ఏళ్లకే అంకుల్స్ లా కనిపిస్తున్నారనే మాట అబ్బాయిలకు ఒక హెచ్చరిక లాంటిదే. పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌ను వదిలేస్తే.. ఆస్తిపాస్తులు ఉన్నా పెళ్లి సంబంధాలు దొరకడం కష్టమని ఈ ఉదంతం చెబుతోంది. అబ్బాయిలు ఇప్పుడైనా కాస్త డైట్, ఎక్సర్‌సైజ్ మీద దృష్టి పెట్టాల్సిందే అంటున్నారు నిపుణులు.

# మీ వంటగదిలో ఈ 7 వస్తువులు ఉంటే గ్యాస్ అవసరం ఉండదు.. మీరూ వాడుతున్నారా?



ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల వల్ల గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాంటి సమయంలో ఇంట్లో గ్యాస్ అయిపోతే మహిళలకు పెద్ద చిక్కు వచ్చి పడుతుంది. అయితే వంటింట్లో కేవలం ఎల్‌పీజీ స్టవ్ మాత్రమే ఉండాలనే నియమం ఏమీ లేదు. ఆధునిక కాలంలో గ్యాస్ అవసరం లేకుండానే.. విద్యుత్తుతో నడిచే హోమ్ అప్లయెన్సెస్ మనకు అందుబాటులో ఉన్నాయి. అవేంటో తెలిస్తే గ్యాస్ సిలిండర్ కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా రుచికరమైన వంటలను వండుకుని ఆనందించొచ్చు.

**ఇండక్షన్ కుక్‌టాప్:**
గ్యాస్ స్టవ్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందినది ఇండక్షన్ కుక్‌టాప్. ఇది విద్యుదయస్కాంత శక్తితో పనిచేస్తుంది. దీనిపై స్టీల్ లేదా ఇనుప పాత్రలను ఉంచి నీళ్లు మరిగించడం, కూరలు వండటం వంటివి చేయవచ్చు. ఉష్ణోగ్రతను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటు ఉండటం వల్ల వంట త్వరగా పూర్తవుతుంది.

**జి-కాయిల్ హాట్ ప్లేట్:**
ఇండక్షన్ స్టవ్ మీద కేవలం కొన్ని పాత్రలే పనిచేస్తాయి. కానీ జి-కాయిల్ ఆధారిత ఎలక్ట్రిక్ కుక్‌టాప్‌పై అల్యూమినియం, మట్టి పాత్రలు, ఇనుము ఇలా ఏదైనా వాడవచ్చు. దీనిపై చపాతీలు, పరోటాలు కూడా నేరుగా కాల్చుకోవచ్చు. సాధారణ గ్యాస్ పొయ్యిలాగే పనిచేసే ఇది చాలా తక్కువ ధరకే లభిస్తుంది.

**మైక్రోవేవ్ ఓవెన్:**
చాలామంది మైక్రోవేవ్ ఓవెన్‌ను కేవలం ఆహారం వేడి చేయడానికి మాత్రమే వాడుతుంటారు. కానీ ఇందులో కూరగాయలు ఉడకబెట్టడం, కేకులు బేక్ చేయడం, గ్రిల్లింగ్ చేయడం వంటివి చేయవచ్చు. కన్వెక్షన్ ఫీచర్ ఉన్న ఓవెన్లలో దాదాపు అన్ని రకాల వంటలను పూర్తి చేయవచ్చు.

**ఎలక్ట్రిక్ ప్రెజర్ కుక్కర్:**
సాధారణ కుక్కర్‌లాగే పనిచేసే ఈ ఎలక్ట్రిక్ ప్రెజర్ కుక్కర్లో అన్నం, పప్పు, మాంసాహారం వంటివి వండుకోవచ్చు. ఇందులో టైమర్ సెట్ చేసుకునే సదుపాయం ఉంటుంది కాబట్టి, వంట పూర్తయ్యాక అది ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. ఇది సమయాన్ని, శ్రమను ఆదా చేస్తుంది.

**ఎయిర్ ఫ్రైయర్:**
ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉన్నవారికి ఎయిర్ ఫ్రైయర్ ఒక వరం అని చెప్పుకోవాలి. ఇందులో చాలా తక్కువ నూనెతో వేపుళ్లు, రోస్టింగ్ చేయవచ్చు. గాలిని వేగంగా సర్క్యులేట్ చేయడం ద్వారా ఆహారాన్ని ఉడికిస్తుంది కాబట్టి, రుచితో పాటు ఆరోగ్యం కూడా దక్కుతుంది.

**ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్.. ఓటీజీ:**
అన్నం వండటానికి రైస్ కుక్కర్ ఎలాగూ ఉంటుంది. కానీ దానిపై ఉండే స్టీమింగ్ ట్రేతో కూరగాయలను కూడా ఉడికించుకోవచ్చు. ఇక కేకులు, బ్రెడ్లు తయారు చేయాలనుకునే వారికి ఓవెన్ టోస్టర్ గ్రిల్లర్(రు+) చక్కగా ఉపయోగపడుతుంది.
ప్రస్తుతం కొనసాగుతున్న గ్యాస్ షార్టేజీ వేళ.. ఈ వస్తువులు వంటింట్లో ఉంటే, గ్యాస్ సిలిండర్ రీఫిల్ ఆలస్యమైనా సరే, మీ వంట గదిలో పొయ్యి వెలుగుతూనే ఉంటుంది. వంట పనులు ఆగిపోవు. దీంతో గ్యాస్ కోసం ఆందోళన చెందకుండా తాత్కాలికంగా సమస్యల నుంచి తప్పించుకోవటానికి ఈ గృహోపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

# ఐటీ షేర్లపై ఏఐ ఎఫెక్ట్ అయిపోయిందా..? ఇప్పుడు స్టాక్స్ కొనొచ్చా..? బ్రోకరేజీల మాట ఇదే




2026 ప్రారంభం నుంచి భారత ఐటీ ఇండెక్స్ ఊహించని కుదుపునకు లోనవుతోంది. కేవలం రెండున్నర నెలల్లోనే ఈ ఇండెక్స్ ఏకంగా 23% పైగా పతనమైంది. ముఖ్యంగా AI వల్ల ఐటీ ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళనలు ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నాయి. అయితే ఈ భారీ పతనం తర్వాత ఇప్పుడు ఐటీ స్టాక్స్ కొనే సమయం వచ్చిందా? మార్కెట్ నిపుణులు ఏం చెబుతున్నారనే ఆసక్తికరమైన వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం...
ప్రస్తుత పతనం తర్వాత ఐటీ దిగ్గజాల వాల్యుయేషన్లు చాలా ఆకర్షణీయంగా మారాయని కోటక్ నియో నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చాలా కంపెనీలు తమ 10 ఏళ్ల సగటు పీఈ కంటే తక్కువ ధరకే లభిస్తున్నాయని చెప్పారు. ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి లార్జ్-క్యాప్ కంపెనీలు దీర్ఘకాలిక పెట్టుబడికి మంచి అవకాశాలుగా కనిపిస్తున్నాయి. రూపాయి విలువ తగ్గడం ఐటీ కంపెనీలకు లాభిస్తుందని, అందుకే ఈ క్లిష్ట సమయంలో మిడ్-క్యాప్ కంటే లార్జ్-క్యాప్ కంపెనీలపై దృష్టి పెట్టడం ఉత్తమమని వారు సూచిస్తున్నారు. అయితే విప్రో విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జెఫరీస్ వంటి ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలు విప్రోపై ప్రతికూల రేటింగ్ ఇచ్చాయి. రాబోయే రెండేళ్లలో విప్రో ఆదాయ వృద్ధి ఇతర కంపెనీల కంటే తక్కువగా ఉంటుందని, షేర్ ధర మరో 8% వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించాయి. మరోవైపు నువామా మాత్రం టాప్-10 ఐటీ కంపెనీలన్నింటిపై సానుకూలంగా ఉన్నాయి. హెచ్‌సీఎల్ టెక్, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ, పర్సిస్టెంట్ వంటి స్టాక్స్‌ను కూడా కొనుగోలు చేయవచ్చని సిఫార్సు చేస్తోంది. ఐటీ రంగంలో ఇప్పుడే పెట్టుబడి పెట్టడం సరికాదని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా తర్వాత ఐటీ కంపెనీల వృద్ధి రేటు గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం లార్జ్-క్యాప్ కంపెనీలు కేవలం 1-3% వృద్ధిని మాత్రమే నమోదు చేస్తున్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ఏఐ ప్రభావం వల్ల భవిష్యత్తులో ఐటీ కంపెనీల ఆదాయం మరింత తగ్గే ప్రమాదం ఉందని, అందుకే షేర్ ధరలు పెరిగే అవకాశం తక్కువని వీరి వాదన. సింపుల్ గా చెప్పాలంటే.. మార్కెట్‌లో ఇప్పుడు చవకగా దొరుకుతున్నాయని కొనేవారు కొందరుంటే, ఏఐ ముప్పు ఇంకా ముగియలేదని భయపడేవారు మరికొందరు. మీ పెట్టుబడి లక్ష్యం దీర్ఘకాలికమైతేనే ఐటీ రంగం వైపు చూడటం మంచిదని బ్రోకరేజ్ సంస్థల అంచనాలు చెబుతున్నాయి.

# చైనా ఏఐ టూల్ సంచలనం.. నెలకు జస్ట్ రూ.240కే ఏఐ ఆఫీస్ అసిస్టెంట్




ప్రముఖ చైనా టెక్ దిగ్గజం 'బైదూ' రొటీన్ ఆఫీస్ వర్క్‌ను సులభతరం చేసేందుకు ఒక కొత్త ఏఐ టూల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. కంపెనీల్లో రోజూవారీగా జరిగే సాధారణ పనులను ఆటోమేట్ చేసేందుకు 'డూక్లా' అనే సరికొత్త ఏఐ సర్వీస్‌ను పరిచయం చేసింది. ఇది కేవలం చాట్‌బాట్ లాగా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా.. ఒక మనిషిలాగా వివిధ దశల్లో పనులను పూర్తి చేయగలదు. ఉదాహరణకు.. సమాచారాన్ని వెతకడం, రిపోర్ట్స్ తయారు చేయటం, కోడింగ్ చేయడం, కస్టమర్ సపోర్ట్ వంటి పనులను ఇది స్వయంగా చక్కబెడుతుందట. ఈ ఏఐ సర్వీస్ ప్రధాన ఆకర్షణ దీని ధర. బైదూ ఈ ప్లాట్‌ఫారమ్‌ను నెలకు కేవలం 17.8 యువాన్లకే.. అంటే మన భారత కరెన్సీలో రూ.240 చెల్లిస్తే సరిపోతుందట. ఒక సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్ కంటే తక్కువ ధరకు లభిస్తుండటంతో.. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా ఏఐ టెక్నాలజీని ప్రయోగాత్మకంగా వాడేందుకు ఇది మంచి అవకాశం కల్పిస్తోంది. కంపెనీలు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేకుండానే నేరుగా క్లౌడ్ ద్వారా ఈ ఏఐ ఏజెంట్లను వినియోగించుకోవచ్చు.
సాధారణ చాట్‌బాట్‌లకు, ఈ ఏఐ ఏజెంట్లకు మధ్య ఉన్న ప్రధాన తేడా పనితీరే. ఏఐ ఏజెంట్లు ఒక పనిని అప్పగిస్తే.. దానికి కావాల్సిన డేటాను సేకరించి, విశ్లేషించి, చివరికి ఒక డాక్యుమెంట్ రూపంలో రిపోర్ట్ సిద్ధం చేస్తాయి. దీనివల్ల ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్ విభాగాల్లో పని భారం తగ్గుతుంది. బైదూ ఇప్పటికే 'ఎర్నీ' వంటి శక్తివంతమైన ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసి ఈ రంగంలో అగ్రగామిగా ఉంది. ఇప్పుడు 'డూక్లా' ద్వారా తన ఆధిపత్యాన్ని మరింత పెంచుకోవాలని భావిస్తోంది. అయితే ఈ ఏఐ సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది మళ్లీమళ్లీ చేసే రొటీన్ పనులను సమర్థవంతంగా చేసినప్పటికీ, క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవడంలో మనుషుల పర్యవేక్షణ తప్పనిసరని వారు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా ఇంత తక్కువ ధరకే ఏఐ సేవలు లభించడం వల్ల భవిష్యత్తులో ఆఫీసు పనులు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. డాక్యుమెంట్ల డ్రాఫ్టింగ్ నుంచి డేటా అనలిటిక్స్ వరకు ప్రతిదీ ఏఐ సాయంతో వేగంగా పూర్తయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. తక్కువ రేటుకే ఏఐ టూల్స్ అందుబాటులోకి రావటం చాలా మంది ఉద్యోగులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఆ రెండు కారణాలే ర్యాలీని ప్రేరేపించాయ్




గడిచిన కొన్ని రోజులుగా యుద్ధ భయాలతో వణికిపోయిన భారత స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకున్నాయి. మార్చి 16న ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్, నిఫ్టీలు భారీ లాభాలతో కళకళలాడాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నప్పటికీ.. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోలుదారులు ఎగబడటంతో మార్కెట్లు 'గ్రీన్' జోన్‌లోకి దూసుకెళ్లాయి. సెన్సెక్స్ 938 పాయింట్లు లాభపడి 75,502 వద్ద ముగియగా, నిఫ్టీ 257 పాయింట్ల లాభంతో తన ప్రయాణాన్ని ముగించింది. వరుసగా 4 రోజుల పాటు నష్టపోయిన మార్కెట్లు నేడు పుంజుకోవడానికి ప్రధాన కారణం వాల్యూ బయింగ్. మెటల్, ఆటో, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. హిందాల్కో, అల్ట్రాటెక్ సిమెంట్, గ్రాసిమ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి సంస్థలు టాప్ గెయినర్లుగా నిలిచాయి. మరోవైపు.. మార్కెట్ ఒడిదుడుకులను సూచించే ఇండియా విక్స్ దాదాపు 5 శాతం తగ్గి 22 స్థాయికి చేరడం ఇన్వెస్టర్లలో అమ్మకాల ఒత్తిడి తగ్గుతుందనే నమ్మకాన్ని కలిగించింది. అయినప్పటికీ విక్స్ ఇంకా 18 పైన ఉండటంతో స్వల్పకాలికంగా మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.
అంతర్జాతీయంగా అందుతున్న సానుకూల వార్తలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధి గుండా వెళ్లే నౌకలకు రక్షణ కల్పించేందుకు అమెరికా నేతృత్వంలో ఒక కూటమి ఏర్పడనున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ రిపోర్ట్ చేసింది. దీనికి తోడు సుమారు 92,712 మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో వస్తున్న భారతీయ నౌకలు 'శివాలిక్', 'నందాదేవి' క్షేమంగా జలసంధిని దాటినట్లు వార్తలు రావడం దేశీయంగా ఇంధన కొరత భయాలను తగ్గించింది. శివాలిక్ నౌక ఇవాళ సాయంత్రం 5 గంటలకు భారత్‌కు చేరుకుంటుందని,
దానికి ప్రాధాన్యత ప్రాతిపదికన బెర్తింగ్ ఏర్పాట్లు చేసినట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది.
భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్‌తో జరిపిన చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొనడం దౌత్యపరంగా శాంతి దిశగా అడుగులు పడుతున్నాయనే సంకేతాలను ఇచ్చింది. ఈ సానుకూల పరిణామాలతో అమెరికా ఫ్యూచర్లు కూడా లాభాల్లో ట్రేడవ్వడం గ్లోబల్ మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. యుద్ధ మేఘాల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ తన పటిష్టతను చాటుకుంటూ రికవరీ బాట పట్టడం విశేషం. మొత్తానికి వాల్యూ బైయింగ్, తగ్గిన ఆందోళనలు ఇవాళ మార్కెట్లను నష్టాల నుంచి భారీ లాభాల దిశగా నడిపించాయి.


# హోటళ్ల 5 శాతం గ్యాస్ ఛార్జీలు : సంక్షోభం నుంచి సంపద సృష్టిస్తున్న వ్యాపారులు




సంక్షోభం నుంచి సంపద సృష్టించటం అంటే ఇదే.. జనం అంతా గ్యాస్ కొరత ఇబ్బంది పడుతుంటే.. హోటళ్లు మాత్రం సరికొత్త ఐడియాలతో సంపద సృష్టించుకుంటున్నారు. అసలు గ్యాస్ లేదురా బాబూ అంటే.. ఉన్న గ్యాస్ కు అదనపు ఛార్జీలు వేస్తూ.. కస్టమర్ల నుంచి దోచుకుంటున్నారు. ఇప్పటి వరకు సెంట్రల్ +రూ.. స్టేట్ +రూ అని మాత్రమే ఉండేవి బిల్లులో.. ఇప్పుడు కొత్తగా గ్యాస్ సర్వీస్ ఛార్జీలు అనే కాలం యాడ్ చేశారు. అసలు గ్యాస్ కొరత ఉంటే.. ఉన్న గ్యాస్ కు అదనపు ఛార్జీలు వసూలు చేయటం ఏంటనే ప్రశ్నలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. గ్యాస్ లేకుండా ఎలా వండుతున్నారు.. గ్యాస్ ఉంటేనే కదా హోటల్ నడుపుతున్నది.. అలాంటప్పుడు గ్యాస్ ఛార్జీలు ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బెంగళూరు సిటీలో హోటళ్ల యజమానుల దోపిడీపై వివరాలు ఇలా ఉన్నాయి..
దేశంలో ప్రస్తుతం గ్యాస్ కొరత సామాన్యుడిని వణికిస్తుంటే.. కొందరు వ్యాపారులు మాత్రం ఈ సంక్షోభాన్ని 'క్యాష్' చేసుకోవడంలో సరికొత్త రూట్ వెతుక్కుంటున్నారు. సాధారణంగా హోటల్‌కు వెళ్లి ఏదైనా తింటే సర్వీస్ ఛార్జ్ లేదా జీఎస్టీ వేయడం చూస్తుంటాం. కానీ బెంగళూరులోని ఒక కేఫ్ ఏకంగా 'గ్యాస్ క్రైసిస్ ఛార్జ్' పేరుతో కస్టమర్లకు షాక్ ఇచ్చింది. వేడి చేసే అవసరం లేని చల్లని లెమనేడ్ అదేనండి బాబు నిమ్మరసం ఆర్డర్ చేసినా.. దానిపై గ్యాస్ ఛార్జీలు వసూలు చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో నెటిజన్లను ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.
బెంగళూరుకు చెందిన థియో కేఫ్(ర్షవశీ ఝుటవ) అనే రెస్టారెంట్‌లో ఒక కస్టమర్ 2 మింట్ లెమనేడ్‌లు ఆర్డర్ చేశాడు. వాటి ధర రూ.358 కాగా.. బిల్లు చూసి అతను అవాక్కయ్యాడు. అందులో 5 శాతం 'గ్యాస్ క్రైసిస్ ఛార్జ్' కింద రూ.17.01 అదనంగా సంస్థ వసూలు చేసింది. విచిత్రం ఏమిటంటే.. నిమ్మరసం తయారు చేయడానికి గ్యాస్ అవసరమే ఉండదు.
ఐస్ ముక్కలు, పంచదార, నిమ్మరసం కలిపి ఇచ్చే డ్రింక్‌పై కూడా గ్యాస్ సంక్షోభం పేరుతో డబ్బులు వసూలు చేయడంపై నెట్టింట విమర్శలు వినిపిస్తున్నాయి. "లెమనేడ్ తయారీలో ఎల్పీజీ గ్యాస్ వాడతారా? లేక నిమ్మకాయలు గ్యాస్ స్టవ్ మీద వేడి చేస్తారా?" అంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండటంతో గ్లోబల్ గ్యాస్ సప్లై దెబ్బతిన్న మాట వాస్తవమే. స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ జలసంధి మూతపడటంతో భారత్‌లో కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొరత తీవ్రంగా ఉంది. ఢిల్లీ, బీహార్, బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో గ్యాస్ సెంటర్ల ముందు కిలోమీటర్ల మేర క్యూలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని సాకుగా చూపి కొన్ని హోటళ్లు మెనూలో ఐటమ్స్ తగ్గించగా, మరికొన్ని హోటళ్లు ఇలా వింత వింత ఛార్జీలతో కస్టమర్ల జేబులకు చిల్లు పెడుతున్నాయి. ఒకవైపు గ్యాస్ అందక సామాన్యులు అల్లాడుతుంటే..
మరోవైపు ఇలాంటి అక్రమ వసూళ్లు ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. గ్యాస్ సంక్షోభం ఉంది కదా అని ప్రతి వస్తువుపై ఛార్జీలు వేయడం ఎంతవరకు సమంజసమని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆయిల్ రేట్లు, కూరగాయల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడికి.. ఇలాంటి వింత ఛార్జీలు తోడవ్వడం ఆగ్రహాన్ని పెంచేస్తోంది. ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఇలాంటి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు. తవ్వుతూ పోతే ఇలాంటి సంస్థలు గల్లీ గల్లీలో కనిపిస్తాయంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# మూత్రం వస్తున్నా ఆపుకుంటున్నారా..?

నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగ పట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగ పట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూత్రవిసర్జన శరీరం నుండి అదనపు నీటిని, వివిధ విషాలను తొలగిస్తుంది. సమతుల్యతను కాపాడుకోవడానికి ఈ ప్రక్రియ చాలా అవసరం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీర సహజ ప్రక్రియలు దెబ్బతింటాయి. కొంతమంది దీనిని తేలికగా తీసుకుంటారు.. కానీ పదే పదే మూత్రం ఆపుకోవడం లేదా బిగపట్టుకోవడం వల్ల క్రమంగా ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. మీ శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరించడం మంచిది కాదు. సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం వల్ల శారీరక సాధారణ పనితీరు కొనసాగుతుంది. అందువల్ల, భవిష్యత్తులో సమస్యలను నివారించడానికి మూత్రం ఆపడం లేదా బిగపట్టడం వల్ల కలిగే హానిని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీరంపై అనేక ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిలిచి ఉన్నప్పుడు, ఒత్తిడి పెరిగి, మూత్రాశయ కండరాలు ఒత్తిడికి గురవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఈ అలవాటు మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ల (యుటిఐ) ప్రమాదాన్ని పెంచుతుంది.



ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కూడా పెరుగుతుంది. అదనంగా, పదే పదే మూత్ర విసర్జన చేయడం వల్ల మూత్రాశయం సరిగ్గా ఖాళీ అయ్యే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. కొంతమందికి పొత్తి కడుపులో నొప్పి లేదా అసౌకర్యం కలగవచ్చు. ఈ అలవాటు ఎక్కువ కాలం కొనసాగితే, అది మూత్రపిండాల సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందువల్ల, ఎక్కువసేపు మూత్రాన్ని ఆపడం మంచిది కాదు.. మీ శరీరం సంకేతాలు ఇచ్చిన సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు, వెంటనే బాత్రూమ్‌కి వెళ్లడం సాధ్యం కాని పరిస్థితి తలెత్తవచ్చు.. మీరు మీ మూత్రాన్ని కొంతసేపు ఆపవలసి రావచ్చు. అలాంటి సందర్భాలలో, మీ శరీరాన్ని విశ్రాంతి తీసుకోవడానికి, ఒత్తిడిని నివారించడానికి ప్రయత్నించండి. వీలైతే, నిశ్శబ్దంగా కూర్చోవడానికి ప్రయత్నించండి. ఎందుకంటే అధిక కదలిక మూత్రాశయంపై ఒత్తిడిని పెంచుతుంది.

# అల్లం, నిమ్మరసాన్ని తాగితే జరిగేది ఇదే



అల్లాన్ని వేల సంవత్సరాలుగా వంటల్లో, ఔషధాల్లో వినియోగిస్తున్నారు. ఇది యాంటీఆక్సిడెంట్, రక్త శుద్ధికి తోడ్పడుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల ప్రకారం, అల్లం షుగర్ నియంత్రణకు తోడ్పడుతుంది. నిమ్మరసంతో కలిపి అల్లం పానీయం తీసుకుంటే.. బరువు తగ్గించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచి, అనేక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ప్రకృతి ప్రసాదించిన అత్యంత శక్తివంతమైన వనమూలికలలో అల్లం ఒకటి. భారతీయులు దాదాపు వేల సంవత్సరాలుగా అల్లాన్ని తమ సంప్రదాయ వైద్యంలో, వంటకాల్లో భాగంగా చేసుకున్నారు. అల్లంలో అనేక విలువైన పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అల్లంలో జింజెరోల్ అనే ముఖ్యమైన బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. దీంతోపాటు.. విటమిన్ సి, బి6, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్.. తోపాటు.. యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి శరీర ఆరోగ్యానికి ఎంతో కీలకం. అందుకే.. అల్లంతో అద్భుతమైన వైద్యం చేయవచ్చని చెబుతారు ఆయుర్వేద వైద్యులు.. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి.. వికారం, కీళ్ల నొప్పులు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అల్లం ఒక మంచి ఔషధంగా పనిచేయడమే కాకుండా, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గా కూడా ప్రసిద్ధి చెందింది. ఇది రక్త శుద్ధికి తోడ్పడుతుంది, రక్తనాళాలలో రక్తం గడ్డకట్టకుండా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా అల్లం వాడటం వలన కొన్ని వారాల్లో కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అల్లం కడుపులో పూత ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. అలాగే, ఇది నోటి దుర్వాసనను సమర్థవంతంగా పోగొట్టి, నోటిలో చేరిన ప్రమాదకర బ్యాక్టీరియాను సంహరించి దంతాలను ఆరోగ్యముగా ఉండేలా చేస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల్లో అల్లం షుగర్ జబ్బు నియంత్రణ చేయగలిగిన శక్తివంతమైన ఔషధంగా వెల్లడైంది. అల్లం రక్తములోని చక్కెరలు కండరాలకు చేరే ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా మధుమేహ నిర్వహణలో సహాయపడుతుంది. అజీర్తితో బాధపడుతున్న వారికి అల్లం సేవించడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ఉదరంలో గ్యాస్ ఏర్పడినప్పుడు అల్లం దివ్యౌషధంలా పనిచేస్తుంది. దగ్గు, జలుబు, కఫం వంటి శ్వాసకోశ సమస్యలకు అల్లం అమృతంలా పనిచేస్తుందని అనడంలో సందేహం లేదు. ఇది జీర్ణక్రియ సాఫీగా జరిగేలా ఉపయోగపడుతుంది. నిమ్మకాయ, మంచి సువాసన మరియు రుచి కలిగిన సిట్రస్ జాతికి చెందిన పండు. దీనికి ఉన్న యాంటీ బాక్టీరియల్ గుణాలు, అధిక విటమిన్ సి కంటెంట్ ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. నిమ్మలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, అనేక అనారోగ్య సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. నిమ్మ వలన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. అజీర్ణం వలన ఏర్పడిన గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యలకు నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. నిమ్మ, అల్లం కలిపిన పానీయం రోజువారీ తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఈ పానీయాన్ని తయారుచేయడానికి, అల్లాన్ని శుభ్రంగా కడిగి, దంచి ఒక గ్లాసు నీళ్ళల్లో మరిగించి, దానికి ఒక నిమ్మకాయ రసం కలిపి రోజూ తీసుకోవాలి. నిమ్మలో ఉన్న విటమిన్ సి కొవ్వును కరిగించి బరువు తగ్గించేందుకు సహాయపడుతుంది. అల్లం కూడా శరీరంలోని ఫ్యాట్‌ను కరిగిస్తుంది.

# బరువు తగ్గడం ఎందుకంత కష్టం?

బరువు తగ్గడం అనేది కేవలం “తక్కువ తినడం, ఎక్కువ కదలడం” అనే సరళమైన సమీకరణం కాదు. చాలా మంది పట్టుదలతో డైటింగ్ మొదలుపెట్టినా, కొద్ది రోజులకే ఆగిపోతుంటారు లేదా తగ్గిన బరువు మళ్ళీ పెరుగుతుంటారు. దీనికి కారణం క్రమశిక్షణ లేకపోవడం కాదు. మన శరీరంలోని సంక్లిష్టమైన 'బయోలజీ' అని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన శరీరం బరువు తగ్గడానికి ఎందుకు సహకరించదు? ప్రపంచ ఆరోగ్య సంస్థప్రకారం 1975 నుండి ఊబకాయం సమస్య మూడు రెట్లు పెరిగింది. మన దేశంలో కూడా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. అందరూ బరువు తగ్గాలని ప్రయత్నిస్తారు, కానీ కొద్దిమంది మాత్రమే సక్సెస్ అవుతారు. ఎందుకు? ఎందుకంటే మనం బరువు తగ్గాలని డైటింగ్ మొదలుపెట్టినప్పుడు, మన మెదడు అది మన ఆరోగ్యానికి మంచిదని అనుకోదు. బదులుగా, మనం ఏదో ప్రమాదంలో ఉన్నామని, ఆహారం దొరకక 'ఆకలితో అలమటిస్తున్నామని' భావిస్తుంది. అక్కడే అసలు సమస్య మొదలవుతుంది.

మనం తక్కువ కేలరీలు తీసుకోవడం ప్రారంభించగానే, శరీరం తన శక్తిని ఆదా చేసుకోవడానికి 'మెటబాలిజం' (జీవక్రియ) వేగాన్ని తగ్గించేస్తుంది. అంటే, మీరు తక్కువ తిన్నా సరే, శరీరం చాలా తక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. దీనినే 'మెటబాలిక్ అడాప్టేషన్' అంటారు. దీనివల్ల బరువు తగ్గడం ఒకానొక దశలో ఆగిపోతుంది. మనం డైటింగ్ చేస్తున్నప్పుడు, గ్రెలిన్ స్థాయిలు పెరిగి, లెప్టిన్ స్థాయిలు పడిపోతాయి. ఫలితంగా విపరీతమైన ఆకలి, ఆహారంపై కోరికలు పెరుగుతాయి. ఈ హార్మోన్ల మార్పులు డైటింగ్ ఆపేసిన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. మన శరీరంలోని కొవ్వు కణాలకు ఒక రకమైన 'జ్ఞాపకశక్తి' ఉంటుంది. శరీరం గతంలో ఏ బరువు వద్ద ఎక్కువ కాలం ఉందో, మళ్ళీ ఆ బరువుకు చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందుకే బరువు తగ్గిన వారు మళ్ళీ కిలోలు పెరగడం చూస్తుంటాం. దీనికి తోడు నిద్రలేమి, ఒత్తిడి తోడైతే



పరిస్థితి మరింత జటిలమవుతుంది. ఒక్కసారిగా ఆహారం మానేయడం లేదా 'క్రాష్ డైట్స్' చేయడం వల్ల శరీరం వెంటనే 'సర్వైవల్ మోడ్' లోకి వెళ్తుంది. ఇది మెదడులో హై-కేలరీ ఆహారం తినాలనే కోరికను పెంచుతుంది. అందుకే బరువు తగ్గడం అనేది క్రమంగా, సహజంగా జరగాలి తప్ప బలవంతంగా కాదు. తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి కేవలం డైట్, వ్యాయామం సరిపోకపోవచ్చు. అటువంటప్పుడు 'బేరియాట్రిక్ సర్జరీ' వంటి వైద్య చికిత్సలు అవసరమవుతాయని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇవి కేవలం కడుపు పరిమాణాన్ని తగ్గించడమే కాకుండా, మెదడుకు వెళ్లే హార్మోన్ల సంకేతాలను మారుస్తాయి. బరువు పెరగడం అనేది కేవలం క్రమశిక్షణ లోపం కాదు, అది ఒక వైద్యపరమైన సమస్య. మన శరీరంతో పోరాడటం కంటే, దాని పనితీరును అర్థం చేసుకుని సహకరించడం ముఖ్యం. సరైన నిద్ర, ఒత్తిడి లేని జీవితం మరియు క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లతో మాత్రమే శాశ్వత బరువు తగ్గడం సాధ్యమవుతుంది.

# బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవి తింటే రోజంతా ఎనర్జీ?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఉదయాన్నే ఆరోగ్యకరమైన, శక్తినిచ్చే అల్పాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయాలనుకునే వారికి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్య ఉన్న వారికి ప్రోటీన్ అధికంగా ఉండే అల్పాహారం ఎంతో మేలు చేస్తుంది. తక్కువ కేలరీలు, తక్కువ సోడియం, అధిక ప్రోటీన్ కలిగిన కొన్ని అద్భుతమైన బ్రేక్‌ఫాస్ట్ రెసిపీలు ఏంటో తెలుసుకుందాం.. చాలామంది బరువు తగ్గాలని లేదా ఆరోగ్యం కోసమని ఉదయం పూట ఏదో ఒకటి అరకొరగా తింటుంటారు. కానీ, సరైన పోషకాలు లేని అల్పాహారం వల్ల మధ్యాహ్నం లోపే నీరసం వచ్చేస్తుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించడమే కాకుండా, కండరాల పుష్టిని ఇస్తుంది. ఈ రెసిపీలు కేవలం ఆరోగ్యకరమైనవే కాదు, చాలా రుచికరమైనవి కూడా!

**1. ధాన్యాలు, ఓట్స్ రెసిపీలు**

సేవరీ ఓట్మీల్ గ్రెయిన్ బౌల్– ఓట్స్‌ను సోయా పాలతో ఉడికించి, దానిపై పోచ్డ్ ఎగ్ (ఉడికించిన గుడ్డు), అవకాడో ముక్కలు, కాల్చిన ఎర్ర మిరపకాయల మిశ్రమంతో తీసుకుంటే అద్భుతంగా ఉంటుంది. చాక్లెట్–స్ట్రాబెర్రీ బేక్డ్ ఓట్స్– కోటేజ్ చీజ్, ఓట్స్, ప్రోటీన్ పౌడర్ కలిపి బేక్ చేసి, స్ట్రాబెర్రీలతో తీసుకునే ఈ వంటకం తీపిగా, రుచిగా ఉంటుంది. వనిల్లా–క్రాన్బెర్రీ ఓవర్ నైట్ ఓట్స్– రాత్రే నానబెట్టిన ఓట్స్‌లో వనిల్లా, క్రాన్బెర్రీలు కలిపి ఉదయం తింటే సమయం ఆదా అవుతుంది. స్ట్రాబెర్రీ ఓ పీనట్ బటర్ ఓవర్ నైట్ ఓట్స్– సోయా పాలు, గ్రీక్ పెరుగు, పీనట్ బటర్ కలయికతో ఇందులో 17 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. 2. ఎగ్, ప్రొటీన్ బౌల్స్: హై–ప్రోటీన్ కోటేజ్ చీజ్ బౌల్– సాఫ్ట్ కుక్డ్ ఎగ్, డిల్ ఆకులు మరియు కోటేజ్ చీజ్‌తో చేసే ఈ బౌల్ ఉదయం పూట మంచి శక్తినిస్తుంది. స్పినాచ్ ఓ ఫ్రైడ్ ఎగ్ గ్రెయిన్ బౌల్– నట్టి ఫ్లేవర్ ఇచ్చే వీట్ బెర్రీస్ బేస్‌గా, దానిపై పాలకూర, వేరుశనగలు, గుడ్డు వేసి చేసే పోషకాల గని ఇది. సౌత్ వెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ స్కిల్లెట్– పుట్టగొడుగులు, బెల్ పెప్పర్స్, బేకన్, ఎగ్స్‌తో ఒకే పెనంలో చేసే ఈ వంటకం వెజిటేబుల్ కౌంట్‌ను పెంచుతుంది. స్టోవ్‌టాప్ వెజ్జీ ఫ్రిటాటా– తక్కువ ధరలో దొరికే గుడ్లు, ఫ్రోజన్ కూరగాయలతో త్వరగా చేసుకునే ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్. 3. రిఫ్రెషింగ్ స్మూతీస్, షేక్స్: ఆరెంజ్–మాంగో ఫ్లాక్స్ సీడ్ షేక్– పెరుగు, మామిడి పండు, అవిసె గింజల కలయికతో చేసే ఈ షేక్ వర్కవుట్ తర్వాత తీసుకుంటే చాలా మంచిది. చాక్లెట్–స్ట్రాబెర్రీ ప్రోటీన్ షేక్– సోయా పాలు, పెరుగు, కోకో పౌడర్‌తో షుగర్ లేకుండానే తీపిగా ఉండేలా చేసుకోవచ్చు. వాటర్ మిలన్–పీచ్ స్మూతీ– పుచ్చకాయ, పీచ్ పండ్లతో చేసే ఈ స్మూతీ వేసవి ఉదయాలకు పర్ఫెక్ట్. మిక్స్డ్ బెర్రీ బ్రేక్‌ఫాస్ట్ స్మూతీ– ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్స్ సమానంగా ఉండి, పూర్తి భోజనం చేసిన అనుభూతినిస్తుంది. 4. పుడ్డింగ్స్, పార్ఫైట్స్: బ్లూబెర్రీ ఓ పీనట్ బటర్ చియా పుడ్డింగ్– చియా గింజలు, బాదం పాలు, బ్లూబెర్రీల మిశ్రమం. రాత్రంతా నానిన ఈ పుడ్డింగ్ చాలా క్రీమీగా ఉంటుంది. రాస్ప్ బెర్రీ–బనానా యోగర్ట్ పార్ఫైట్– గ్రీక్ పెరుగు, పీచు పదార్థం ఎక్కువగా ఉండే పండ్లు, పెకాన్ నట్స్‌తో పొరలు పొరలుగా చేసుకునే పోర్టబుల్ బ్రేక్‌ఫాస్ట్. స్ట్రాబెర్రీ ఓ యోగర్ట్ పార్ఫైట్– గ్రీక్ పెరుగు, తాజా పండ్లు, క్రంచీ గ్రానోలా కలయిక.

# అన్నం తిన్నాక పండ్లు తింటే ఏమవుతుంది..?



పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. కానీ మీరు వాటిని తినే సమయం మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని మీకు తెలుసా? చాలామంది భోజనం ముగిశాక డెజర్ట్‌గా పండ్లను తింటుంటారు. అయితే ఇది అమృతమా లేక జీర్ణవ్యవస్థకు శాపమా? భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే కడుపులో ఏం జరుగుతుంది? పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నది కాదనలేని సత్యం. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లు మనల్ని రోగాల నుండి రక్షిస్తాయి. అయితే చాలామంది భోజనం ముగిసిన తర్వాత డెజర్ట్ లాగా పండ్లను తింటుంటారు. మరి ఇలా భోజనం తర్వాత వెంటనే పండ్లు తినడం సరైనదేనా? దీనివల్ల జీర్ణవ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? సాధారణంగా పండ్లలో ఉండే సహజ చక్కెరలు, ఫైబర్ చాలా త్వరగా జీర్ణమవుతాయి. కానీ మనం తినే భారీ భోజనంలోని ప్రోటీన్లు, కొవ్వులు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే, అవి జీర్ణకోశంలో భోజనంతో కలిసిపోయి జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. దీనివల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా ఐబీఎస్ లేదా ఫ్రక్టోజ్ అసహనం ఉన్నవారు భోజనం తర్వాత పండ్లు తింటే అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది. భోజనంతో పాటు పండ్లు తింటే పోషకాలు అందవని చాలామంది నమ్ముతుంటారు. కానీ ఇందులో నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మానవ జీర్ణవ్యవస్థ ఆహారం నుండి గరిష్ట పోషకాలను గ్రహించేలా రూపొందించబడింది. చిన్న ప్రేగు చాలా పొడవుగా ఉండి, పోషకాలను నెమ్మదిగా, సమర్థవంతంగా గ్రహిస్తుంది. కాబట్టి భోజనం తర్వాత పండ్లు తిన్నా పోషకాల లోపం ఏర్పడదు. అన్ని పండ్లు భోజనం తర్వాత ఇబ్బంది కలిగించవు. కొన్ని పండ్లు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బొప్పాయి, పైనాపిల్‌లో ఉండే ఎంజైమ్‌లు మనం తిన్న ఆహారంలోని ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి. కివి, బెర్రీలు కూడా భోజనం తర్వాత సులభంగా జీర్ణమై, శరీరానికి మేలు చేస్తాయి. మీకు జీర్ణ సంబంధిత సమస్యలు ఏవీ లేకపోతే భోజనం తర్వాత పండ్లు తీసుకోవచ్చు. అయితే పండ్ల నుండి పూర్తి ప్రయోజనం పొందాలనుకుంటే, భోజనానికి గంట ముందు లేదా రెండు గంటల తర్వాత తీసుకోవడం ఉత్తమ వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.

# నమన్ అవార్డ్స్‌లో బీసీసీఐ బ్లండర్ మిస్టేక్స్.. సోషల్ మీడియాలో విమర్శలు







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్వహించిన వార్షిక నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగా సోషల్ మీడియాలో క్రికెట్ అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మార్చి 15న ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో 2025వ ఏడాదిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు అవార్డులు అందజేయడంతో పాటు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన భారత జట్లను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురుషుల జట్టు 2025లో గెలిచిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, 2026లో సాధించిన టీ20 ప్రపంచకప్ విజయాలకు గాను సత్కారం చేసింది. అలాగే మహిళల జట్టు 2025లో వన్డే ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో బీసీసీఐ ప్రత్యేకంగా అభినందించింది.

అలాగే2025లో అండర్- 19 మహిళల ప్రపంచకప్ గెలిచిన, 2026లో అండర్- 19 మెన్స్ ప్రపంచకప్ సాధించిన జట్లకు కూడా బీసీసీఐ ప్రత్యేకంగా సత్కారం చేసింది. అండర్- 19 మహిళల జట్టు కెప్టెన్ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలో విజయం సాధించినప్పటికీ, స్టేజ్‌పై ప్రదర్శించిన గ్రాఫిక్‌లో మాత్రం హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని సీనియర్ మహిళల జట్టు ప్రపంచకప్ గెలిచిన ఫోటోను ప్రదర్శించడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. విజేత జట్ల నుంచి ముగ్గురు ప్లేయర్స్ ని స్టేజ్‌పైకి ఆహ్వానించి ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లేతో మాట్లాడించారు. ఈ సందర్భంగా మహిళల ప్రపంచకప్ గెలిచిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన పురుషుల జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అలాగే ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్టేజ్‌పై పాల్గొన్నారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో నిర్వాహకులు మరో పొరపాటు కూడా చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పేరు ప్రదర్శించడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 2025లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్‌కు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ క్రికెటర్‌గా (పురుషుల విభాగంలో) శుభ్‌మాన్ గిల్ అత్యంత ప్రతిష్టాత్మకమైన (పాలీ ఉమ్రిగర్ అవార్డును) క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. 2025లో అన్ని ఫార్మాట్లలో కలిపి 35 మ్యాచ్‌లలో 1,764 పరుగులు చేసి, సగటు 49తో 7 సెంచరీలు చేసి, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. కాగా ఈ కార్యక్రమంలో జరిగిన పొరపాట్లు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తూ బీసీసీఐపై క్రికెట్ అభిమానులు తీవ్రంగా మండిపడుతున్నారు.

# ఐపీఎల్10 జట్ల కెప్టెన్లు వీరే.. ఏ టీమ్‌కి ఎవరో తెలుసుకుందామా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28వ తేదీన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ప్రారంభం కానుంది. దీంతో ఐపీఎల్ లో ఎన్నో సంవత్సరాలుగా మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ లాంటి వారు ఆయా జట్లను ముందుండి నడిపించారు. దీంతో చెన్నై, ముంబై వంటి టీమ్స్ చెరో ఐదు సార్లు ట్రోఫీని కైవసం చేసుకున్నాయి. కానీ ఇప్పుడు ఐపీఎల్ 2026 సీజన్ సమీపిస్తుంది. దీంతో ఆయా జట్లు నాయకత్వంలో కొన్ని మార్పులు చేశాయి. కొన్ని జట్లు కొత్త కెప్టెన్లతో టోర్నీలోకి వస్తుండగా, మరి కొన్ని టీమ్స్ నయా ప్లేయర్స్ కి ఈసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిచిన ఈ జట్టు గత సీజన్‌లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో లీగ్ మధ్యలో గాయంతో గైక్వాడ్ కూడా జట్టుకు దూరమయ్యాడు. అయితే మహేంద్ర సింగ్ ధోనీ జట్టు పగ్గాలు అందుకున్నప్పటికీ ఫలితం మారలేదు. ఈసారి గైక్వాడ్ బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలో కూడా తన ప్రతిభను చూపించాల్సి ఉంటుంది.

**డిల్లీ క్యాపిటల్స్ - అక్షర్ పటేల్:**
ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అక్షర్ పటేల్ పూర్తి స్థాయి కెప్టెన్‌గా మొదటిసారి బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. జట్టులో అనుభవజ్ఞులు ఉన్నప్పటికీ ఫ్రాంచైజీ అతనిపై నమ్మకం ఉంచింది. గత కొన్నేళ్లుగా జట్టుకు అత్యంత స్థిరమైన ఆటగాడిగా నిలిచిన అక్షర్ ఇప్పుడు కెప్టెన్సీ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాడో అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

**గుజరాత్ టైటాన్స్- శుభ్‌మన్ గిల్:**
గుజరాత్ టైటాన్స్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2022లో టైటిల్ గెలిచిన ఈ జట్టుకు 2024లో గిల్ నాయకత్వం చేపట్టాడు. గత రెండు సీజన్లు మంచి ప్రదర్శన చేసినప్పటికీ పూర్తిస్థాయి విజయాన్ని సాధించలేకపోయింది. ఈసారి జట్టు మరింత మెరుగైన ఫలితాలను ఆశిస్తోంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్ - అజింక్య రహానే:**

మూడుసార్లు ఐపీఎల్ విజేతలైనా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు అజింక్య రహానే నాయకత్వం వహించనున్నాడు. అనుభవజ్ఞుడైన రహానే ఒత్తిడిని తట్టుకుని జట్టుని ముందుకు నడిపిస్తాడనే నమ్మకం ఫ్రాంచైజీకి ఉంది. సమతుల్యమైన జట్టుతో ఈసారి మరో టైటిల్ గెలవడమే వారి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**లక్నో సూపర్ జెయింట్స్ - రిషభ్ పంత్:**
లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు రిషభ్ పంత్ మరోసారి కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. గత సీజన్‌లో అతను బ్యాటింగ్ లో పెద్దగా రాణించలేదు.. కెప్టెన్సీలో కూడా అనుకున్నంతగా సక్సెస్ కాలేదు.. అయినప్పటికీ అతని దూకుడు, ధైర్యం జట్టుకు పెద్ద బలంగా చెప్పాలి.

**ముంబై ఇండియన్స్ - హార్దిక్ పాండ్యా:**
ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా నాయకత్వం వహిస్తున్నాడు. జట్టులో అనేక మంది ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లు ఉండటంతో ముంబై ఎప్పుడూ బలమైన ప్రత్యర్థిగానే కొనసాగుతుంది. అన్నీ సరిగ్గా కలిసొస్తే ఈసారి టైటిల్ రేసులో ముందుండే అవకాశం ఉంది.

**పంజాబ్ కింగ్స్ - శ్రేయస్ అయ్యర్:**
పంజాబ్ కింగ్స్ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా రెండో సీజన్ లో కూడా కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో పంజాబ్ ని ఫైనల్ వరకు చేర్చిన తర్వాత కేవలం 6 పరుగుల తేడాతో టైటిల్ కోల్పోయింది. ఆ ప్రయాణంలో అయ్యర్ కీలక పాత్ర పోషించాడు. ఈసారి జట్టును మరోసారి టైటిల్‌కు చేరవేయాలనే లక్ష్యంతో ముందుకు నడుస్తున్నాడు.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రాజత్ పాటిదార్:**
డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు రాజత్ పాటిదార్ కెప్టెన్‌గా ఉన్నాడు. అతని నాయకత్వంలో ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ గెలిచింది. 18 సంవత్సరాల నిరీక్షణకు తెరదించిన ఆ విజయాన్ని ఈసారి కూడా కొనసాగించాలనే లక్ష్యంతో జట్టు ఉంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ - ప్యాట్ కమిన్స్:**
సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా ఆడకపోవడంతో అతను తాజాగా ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో బలమైన జట్టుగా హైదరాబాద్ కనిపిస్తోంది.

**రాజస్థాన్ రాయల్స్ - రియాన్ పరాగ్:**
రాజస్థాన్ రాయల్స్ జట్టుకు యువ ఆటగాడు రియాన్ పరాగ్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఇంతకు ముందు కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే నాయకత్వం వహించిన అతను ఇప్పుడు పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టాడు. సంజూ సాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మారడంతో పరాగ్ కెరీర్‌లో ఇది కీలకమైన అవకాశంగా మారింది.
దీంతో ఐపీఎల్ 2026లో అనుభవజ్ఞులతో పాటు యువ కెప్టెన్ల మిశ్రమంతో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ప్రతి జట్టు తమ కెప్టెన్ నాయకత్వంలో టైటిల్ కోసం పోరాడేందుకు రెడీ అవుతుంది.



సొనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్

# పెళ్లి తర్వాత జోరు పెంచిన విజయ్ దేవరకొండ.. ఏకంగా 5 చిత్రాలు.. క్యూలో దిగ్గజ దర్శకులు



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పెళ్లి తర్వాత తన వ్యక్తిగత జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, ప్రొఫెషనల్ లైఫ్‌లో మునుపెన్నడూ లేని విధంగా స్పీడ్ పెంచారు. ఏకంగా ఐదు భారీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. దిగ్గజ దర్శకులతో జతకడుతూ, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విజయ్ దేవరకొండ క్రేజీ లైనప్ వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం.

**బాక్సాఫీస్ వేటలో 'రణబాలి', 'రౌడీ జనార్థన':**
విజయ్ దేవరకొండ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో 'రణబాలి' అత్యంత కీలకంగా మారింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. దీనితో పాటు రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్థన' (విడి15) పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పక్కా మాస్ ఎంటర్టైనర్ విజయ్‌ను మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందని అభిమానులు నమ్మకంగా ఉన్నారు.

**క్యూలో దిగ్గజ దర్శకులు.. భారీ లైనప్:**
ఈ రెండు సినిమాలే కాకుండా, విజయ్ దేవరకొండ మరికొన్ని సెన్సేషనల్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'హాయ్ నాన్న' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న డైరెక్టర్ శౌర్యువ్‌తో ఒక కొత్త సినిమా చేయబోతున్నారు. ఇక వీటితో పాటు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ సుకుమార్‌తో ఒక క్రేజీ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉంది. అలాగే మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్‌తో కూడా ఒక సినిమా లైన్‌లో పెట్టినట్లు సమాచారం. గౌతమ్ తిన్ననూరితో చేస్తున్న విడి12 ప్రాజెక్ట్ కూడా షూటింగ్ జరుపుకుంటోంది. ఇలా వరుసగా ఐదు సినిమాలతో విజయ్ రాబోయే రెండేళ్లపాటు థియేటర్లలో సందడి చేయనున్నారు.

**రౌడీ బాయ్ పాన్ ఇండియా ప్లాన్:**
విజయ్ దేవరకొండ కేవలం తెలుగు మార్కెట్ మీదనే కాకుండా, పాన్ ఇండియా లెవల్లో తన మార్కెట్ పెంచుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఆయన ఎంచుకుంటున్న కథలు ఇప్పుడు చాలా వైవిధ్యంగా ఉంటున్నాయి. ఇక రెగ్యులర్ లవ్ స్టోరీలకు భిన్నంగా యాక్షన్, పీరియాడిక్ డ్రామాలు ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. ఈ భారీ లైనప్ చూస్తుంటే పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ కెరీర్ మరో రేంజ్‌కు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రష్మికతో చేస్తున్న సినిమా రికార్డులను తిరగరాస్తుందని ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. రౌడీ బాయ్ ఫ్యాన్స్‌కు మాత్రం రాబోయే రోజుల్లో పండుగే అని చెప్పాలి.



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965